# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

11th వార్షికోత్సవ శుభాకాంక్షలు

సంపుటి : 1 సంచిక : 115 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : కడప బుధవారం 31 డిసెంబర్ 2025 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE :115 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED :KADAPA WED 31 DECEMBER 2025 PRICE : 1/- RS

Simultaneously Published form Kadapa, Narasarao Peta,Bapatla,Ongole,Visakhapatnam,Kakinada, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur


## అద్దంకి, కందుకూరు ప్రజల ఆకాంక్ష నెరవేరింది

- కందుకూరు నియోజకవర్గాను ప్రకాశం జిల్లాలో కలపడంపై హర్షం
- ప్రజల ఆకాంక్షల మేరకు అద్దంకికి రెవెన్యూ డివిజన్ మంజూరు చేసినట్టు వెల్లడి
- దుగ్గగుడిలో విద్యుత్ అంతరాయంపైనా మంత్రి వివరణ
- జనవరి 6 లేదా 7 తేదీల్లో దేవాదాయ శాఖతో ప్రత్యేక సమన్వయ సమావేశం



పెన్ పవర్ డెస్క్:అద్దంకి, కందుకూరు నియోజకవర్గ ప్రజల ఆకాంక్షను మన్నిస్తూ, ఆ ప్రాంతాలను తిరిగి ప్రకాశం జిల్లాలో కలుపుతూ రాష్ట్ర క్యాబినెట్ తీసుకున్న నిర్ణయం ఎంతో సంతోషదాయకమని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో నేడు జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం చేసిన అశాస్త్రీయ జిల్లాల విభజనను సరిదిద్దుతూ కూటమి ప్రభుత్వం ప్రజలకు మేలు చేసే నిర్ణయం తీసుకుందని పేర్కొన్నారు.యువగళం పాదయాత్ర సమయంలో నారా లోకేశ్ ఇచ్చిన హామీని గుర్తుచేస్తూ,

వివరాలు 2లో..



## శంకరగుప్తం మేజర్ డ్రెయిన్ ఆధునికీకరణ పనులకు పవన్ కల్యాణ్ శంకుస్థాపన

- ఇచ్చిన మాట నిలబెట్టుకున్న పవన్ కల్యాణ్
- రూ. 20.77 కోట్ల అంచనా వ్యయంతో శంకరగుప్తం డ్రెయిన్ పనులకు శంకుస్థాపన
- క్యాంపు కార్యాలయం నుంచి వర్చువల్‌గా పాల్గొన్న డిప్యూటీ సీఎం



పెన్ పవర్ డెస్క్:కోనసీమ జిల్లా అభివృద్ధి కార్యక్రమాల్లో మరో కీలక అడుగు పడింది. జిల్లా పరిధిలోని శంకరగుప్తం మేజర్ డ్రెయిన్ ఆధునికీకరణ పనులకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన మంగళగిరి క్యాంపు కార్యాలయం నుంచి వర్చువల్‌గా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్, కోనసీమ జిల్లా కలెక్టర్, జల వనరుల శాఖ అధికారులు, ఇతర అధికారులు హాజరయ్యారు.ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ, కోనసీమలోని కొబ్బరి రైతులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుని రూ. 20.77 కోట్ల అంచనా వ్యయంతో శంకరగుప్తం డ్రెయిన్ సమస్యను పరిష్కరించేందుకు చర్యలు ప్రారంభించామని తెలిపారు. ప్రత్యేకంగా, రాజోలు పర్యటనలో 45 రోజుల్లో సమస్యను పూర్తి చేయాలని హామీ ఇచ్చినప్పటికీ, 35 రోజుల్లోపే ఈ డ్రెయిన్ సమస్యకు ప్రభుత్వం పరిష్కారం చూపించింది.డ్రెయిన్ ఆధునికీకరణ ద్వారా జిల్లా అభివృద్ధిలో కొత్త దశ ప్రారంభంకానుంది. శంకరగుప్తంలోని వర్షకాల సమస్యలను సమర్ధవంతంగా పరిష్కరించడానికి ఇది దోహదపడనుంది.



## అమిత్ షా వ్యాఖ్యల పై మమతా బెనర్జీ ఫైర్

- బెంగాల్‌లో ఉగ్రవాద నెట్‌వర్క్‌లు విస్తరిస్తున్నాయన్న అమిత్ షా
- పహల్గాం, ఢిల్లీ వంటి ప్రాంతాల్లో ఉగ్రదాడులు ఎవరు చేశారో చెప్పాలన్న మమత
- బీజేపీ నేతలు అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని మండిపాటు

పెన్ పవర్ డెస్క్:బెంగాల్ రాజకీయాలు మరోసారి హాట్ టాపిక్‌గా మారా యి. కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలపై పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో

వివరాలు 2లో..



## మందులకు కూడా లొంగని డెడ్లీ ఫంగస్... గతంలో కంటే ప్రాణాంతకం!

- ప్రపంచవ్యాప్తంగా విస్తరిస్తున్న 'కాండిడా ఆరిస్' ఫంగస్
- చికిత్స అందించినా 50 శాతానికి పైగా మరణాలు
- చర్మంపై ఎక్కువ కాలం ఉంటూ ఇతరులకు వ్యాప్తి
- సాధారణ ల్యాబ్ పరీక్షల్లో గుర్తించడం కష్టం

పెన్ పవర్ డెస్క్:భారతీయ పరిశోధకుల నేతృత్వంలో జరిగిన ఓ తాజా అధ్యయనం ఆరోగ్య రంగంలో ఆందోళనకర విషయాలను వెల్లడించింది. డ్రగ్ రెసిస్టెంట్ (మందులకు లొంగని) ఫంగల్ జాతి 'కాండిడా ఆరిస్' ప్రపంచవ్యాప్తంగా వేగంగా విస్తరిస్తోందని, ఇది గతంలో కంటే ప్రాణాంతకంగా మారుతోందని

వివరాలు 2లో..

## గ్రూప్-2 రిజర్వేషన్లపై పిటిషన్లు కొట్టివేసిన ఏపీ హైకోర్టు... నియామకాలకు లైన్ క్లియర్

- ఏపీ గ్రూప్-2 అభ్యర్థులకు భారీ ఊరట
- గ్రూప్-2 రిజర్వేషన్లపై హైకోర్టు కీలక తీర్పు
- రోస్టర్ పాయింట్లపై దాఖలైన అన్ని పిటిషన్లను తోసిపుచ్చిన ధర్మాసనం
- లక్షలాది మంది నిరుద్యోగ అభ్యర్థులకు లభించిన భారీ ఊరట



పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ గ్రూప్-2 అభ్యర్థులకు హైకోర్టులో భారీ ఊరట లభించింది. గ్రూప్-2 నియామకాల్లో రిజర్వేషన్ రోస్టర్ పాయింట్లను సవాలు చేస్తూ దాఖలైన

వివరాలు 2లో..

## అనుకున్న దానికన్నా ముందుగానే దర్శనాలు ప్రారంభించాం

- శ్రీవారి ఆలయంలో ఘనంగా ప్రారంభమైన వైకుంఠ ఏకాదశి వేడుకలు
- ధనుర్మాస కైంకర్యాల అనంతరం అర్ధరాత్రి దాటాక వైకుంఠ ద్వార దర్శనాలు షురూ
- వైకుంఠ ద్వారం ద్వారా స్వామిని దర్శించుకున్న తెలంగాణ సీఎం



పెన్ పవర్ డెస్క్:తిరుమల శ్రీవారి ఆలయంలో వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని వైకుంఠ ద్వార దర్శనాలు అత్యంత

వివరాలు 2లో..

## పుతిన్ నివాసంపై డ్రోన్ దాడి...

### తీవ్ర ఆందోళన వ్యక్తం చేసిన ప్రధాని మోదీ



- పుతిన్ నివాసంపై దాడి వార్తలు కలచివేసాయన్న మోదీ
- శాంతి చర్చలకు విఘాతం కలిగించే చర్యలు వద్దని హితవు
- 91 డ్రోన్లతో ఉక్రెయిన్ దాడి చేసిందన్న రష్యా
- ట్రంప్ మధ్యవర్తిత్వంతో కొలిక్కి వస్తున్న శాంతి చర్చలు
- యుద్ధం ముగింపు దశకు చేరుకుందన్న అమెరికా అధ్యక్షుడు

పెన్ పవర్ డెస్క్:రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ నివాసం లక్ష్యంగా జరిగిన డ్రోన్ దాడుల పట్ల భారత ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ.. ప్రస్తుతం జరుగుతున్న దౌత్యపరమైన చర్చలే యుద్ధాన్ని ముగించి, శాంతిని స్థాపించడానికి సరైన మార్గమని స్పష్టం చేశారు. పుతిన్ నివాసంపై దాడి జరిగిందన్న వార్తలు తనను కలచివేశాయని, ఇలాంటి సమయంలో

వివరాలు 2లో..

## ఎమ్మెల్యే విరూపాక్షిని పరామర్శించిన జగన్



- రెండు మోకాళ్లకు శస్త్రచికిత్స చేయించుకున్న విరూపాక్షి
- విరూపాక్షికి ఫోన్ చేసి పరామర్శించిన జగన్
- త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించిన వైసీపీ అధినేత

పెన్ పవర్ డెస్క్:కర్నూలు జిల్లా ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షిని వైసీపీ అధినేత జగన్ సోమవారం నాడు పరామర్శించారు. హైదరాబాద్ లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో విరూపాక్షి రెండు మోకాళ్లకు శస్త్రచికిత్స చేయించుకున్నారు. ఈ క్రమంలో, ఆయనకు జగన్ ఫోన్ చేసి పరామర్శించారు. ఆయన ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

## ఢిల్లీ గగనతలంపై సుదర్శన చక్రం.. శత్రువుల డ్రోన్లు, మిసైళ్లను నిర్వీర్యం చేయడమే లక్ష్యం

- ఢిల్లీ గగనతల భద్రతపై కేంద్ర ప్రభుత్వం కీలక అడుగు
- రూ. 5,181 కోట్ల అంచనాతో సుదర్శన చక్రం
- గగనతల ముప్పు పెరుగుతున్న నేపథ్యంలో కేంద్రం ప్రత్యేక దృష్టి



పెన్ పవర్ డెస్క్:దేశ రాజధాని ఢిల్లీ గగనతల భద్రతను మరింత బలోపేతం చేయడంపై కేంద్ర ప్రభుత్వం కీలక అడుగు వేసింది. ఢిల్లీలోని అత్యంత సున్నితమైన వీఐపీ-89 జోన్ పరిధిలో గగనతల రక్షణను కట్టుదిట్టం చేసేందుకు దేశీయంగా అభివృద్ధి చేసిన ఇంటిగ్రేటెడ్ ఎయిర్ డిఫెన్స్ వెపన్ సిస్టమ్స్ కొనుగోలుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ జాతీయ మీడియా ఈ విషయాన్ని వెల్లడించింది.

వివరాలు 2లో..

## ప్రపంచంలోనే రెండో అతిపెద్ద రోడ్ నెట్‌వర్క్‌గా భారత్



- దేశంలో 1.46 లక్షల కిలోమీటర్లకు చేరిన జాతీయ రహదారులు
- 2014తో పోలిస్తే ఎక్స్‌ప్రెస్ వేల నిర్మాణంలో భారీ వృద్ధి
- ప్రమాద బాధితులకు దేశవ్యాప్తంగా ఉచిత వైద్య సాయం అమలు
- క్షతగాత్రులను ఆదుకునే వారికి రూ.25 వేల రివార్డు పెంపు

పెన్ పవర్ డెస్క్:గత 11 ఏళ్లలో భారతదేశం మౌలిక సదుపాయాల కల్పనలో, ముఖ్యంగా జాతీయ రహదారుల విస్తరణలో సరికొత్త చరిత్ర సృష్టించింది. దేశవ్యాప్తంగా జాతీయ రహదారుల పొడవు 1,46,560 కిలోమీటర్లకు చేరడంతో, అమెరికా తర్వాత ప్రపంచంలోనే రెండో అతిపెద్ద రోడ్ నెట్‌వర్క్ కలిగిన దేశంగా భారత్ అవతరించింది. 2014లో 91,287 కిలోమీటర్లుగా ఉన్న జాతీయ రహదారులు, 2025 నాటికి ఏకంగా 61 శాతం వృద్ధిని నమోదు చేసినట్లు కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ వెల్లడించింది.

వివరాలు 2లో..

# ఎడిటర్ వ్యూ

## డేటా కేంద్రాలు.. జనజీవనం అస్తవ్యస్తం!

'కృత్రిమ మేధ' విప్లవం భూగోళాన్ని వేగంగా కమ్ముకుంటోంది. దాన్ని బలోపేతం చేసేందుకు సాగుతున్న గ్లోబల్ పరుగులో అగ్రభాగాన నిలిచేందుకు ఇండియా చేస్తున్న ప్రయత్నంలో భాగంగా, అందుకవసరమైన భారీ డేటా సెంటర్ల నిర్మాణం కోసం రాష్ట్రాలు పోటీ పడుతున్నాయి. ఇప్పటికే నీటి కొరతలో కొట్టుమిట్టాడుతున్న ప్రాంతాల్లో డేటా సెంటర్లు నెలకొల్పుతున్నారు. దీనివల్ల దేశంలో డిజిటల్ బూమ్‌కు సమాంతరంగా నీటి కరవు తాండవిస్తుందనే ఆందోళనలు పెరుగుతున్నాయి. ఈ డిజిటల్ వికాసం జనజీవన వినాశనానికి దారితీస్తోంది. ఆసియాలో మూడవ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించిన ఇండియా అంతర్జాతీయ డేటా సెంటర్ల ఏర్పాటుకు కూడలిగా మారబోతోంది. ఆ క్రమంలో రాష్ట్ర పాలకులు, ప్రభుత్వం అభివృద్ధి పేరుతో చట్టాలు, నిబంధనలు పాటించని అనేక పరిశ్రమలను (రోగ్ ఇండస్ట్రీస్) ప్రజల పన్నుల సొమ్ముతో అనేక రాయితీలు కల్పించి ఏర్పాటు చేస్తున్నారు. ప్రజా జీవనాన్ని, ఆరోగ్యాన్ని, పర్యావరణాన్ని ఫణంగా పెట్టి కార్పొరేట్ కేంద్రిత ఆర్థిక, ద్రవ్య విధానాలను కేంద్రం దన్నుతో అమలు చేస్తుండడం రాష్ట్ర ప్రజలకు శాపంగా పరిణమించనుంది. కాలుష్య కారక, కేన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులను కలిగించే ఘన, ద్రవ, వాయు వ్యర్థాలను యథేచ్ఛగా వెదజల్లే ఫ్యాక్టరీలకు విచ్చలవిడిగా అనేక రుణాలు, సబ్సిడీలు, మౌలిక వసతుల కల్పనతో రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. రాష్ట్రాన్ని ముందుకు తీసుకుపోవడమనే లక్ష్యంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం.. వాతావరణ ప్రతికూల ప్రభావాలను కల్గించే, ప్రాథమికంగా పెద్దఎత్తున విద్యుత్‌ను, నీటిని వినియోగిస్తూ, వేడిని, ఈ-వ్యర్థాలను వెదజల్లుతూ స్థానిక వనరులు ధ్వంసం చేసే, కర్బన ఉద్గారాలను అరాచకంగా వెదజల్లే.. నీటి కరువు, తీవ్ర శీతోష్ణస్థితి మార్పులు, మానసిక, శారీరక రుగ్మతలతో ప్రజారోగ్యాన్ని ప్రమాదంలోకి నెట్టే.. అత్యంత ప్రమాదకరమైన ఈ కేంద్రాల నిర్మాణం క్షమించరాని దారుణం. 2030 నాటికి 6 గిగావాట్ సామర్థ్యంగల డేటా సెంటర్ల ఏర్పాటును రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇప్పటికే 7 డేటా సెంటర్లు రాష్ట్రంలో నడుస్తున్న వాటికి తోడుగా, వైజాగ్ కేంద్రంగా గూగుల్, రిలయన్స్, సిఫీ కార్పొరేట్ సంస్థలు పెద్ద ఎత్తున డేటా కేంద్రాలను నిర్మాణం చేపట్టనున్నాయి. అదే విధంగా విజయవాడ సమీపంలోని ఐ.టి పార్క్‌లో 60 మెగా వాట్ల సామర్థ్యంగల డేటా సెంటర్లను 'పై డేటా సెంటర్స్' అనే సంస్థ ఒక హబ్‌ను ఏర్పాటు చేయనుంది. ఈ డేటా సెంటర్ల నిర్మాణం ద్వారా ఉపాధి అవకాశాలను కల్పిస్తామని, ఆర్థికాభివృద్ధిని తీసుకొస్తామని పాలకులు గోబెల్స్ ప్రచారం చేస్తూ ప్రజల్ని మభ్యపెడుతున్నారు.

ఇండియాలో డేటా సెంటర్ మార్కెట్ విజృంభిస్తోంది. 130–153 డేటా సెంటర్లు దేశవ్యాప్తంగా 31 ప్రాంతాల్లో విస్తరించడమే కాకుండా, రాబోయే కొన్ని సంవత్సరాల్లో ఆ సంఖ్య రెట్టింపు కావొచ్చుననే అంచనాలు జోరుగా సాగు తున్నాయి. మైక్రోసాఫ్ట్, అమెజాన్, ఎన్.టి.టి గ్లోబల్ సెంటర్లు, టెలీ మీడియా గ్లోబల్, ఐరన్ మౌంటైన్, ఈక్వినాక్స్ అనే గ్లోబల్ డేటా సెంటర్ల ఆపరేటర్లు, కంట్రోల్ ఎస్, పై డేటా సెంటర్లు, బి.ఎస్.ఎన్.ఎల్ (నెక్స్ట్ జెనరేషన్ ఇన్ఫినైట్), వెబ్ వర్క్స్, ఎయిర్‌టెల్, అదానీ కనెక్స్, సిఫీ టెక్నాలజీలస్ అనే జాతీయ సంస్థలు డేటా సెంటర్లను నడుపుతున్నాయి. కొత్తగా గూగుల్ (అదానీ కనెక్స్ సహకారంతో), టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్, రిలయన్స్ ఎంటర్‌ప్రైజెస్ సంస్థలు కొత్తగా భారీ డేటా సెంటర్ల ఏర్పాటుకు రంగం సిద్ధం చేసుకున్నాయి. వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ రాయితీలతో అత్యంత ప్రమాదకర డేటా సెంటర్ల ఏర్పాటు కోసం పోటీ పడుతున్న వాటిలో ఆంధ్రప్రదేశ్ అగ్రభాగాన నిలిచేందుకు దారుణమైన రీతిలో ప్రజారోగ్యం, పర్యావరణం, ఆర్థిక వ్యవస్థలను ఫణంగా పెడుతోంది. సంప్రదాయ డేటా సెంటర్ ఏడాదికి 10–25 మెగావాట్ల విద్యుత్‌ను ఖర్చు చేస్తే, ఎ.ఐ తో నడిచే డేటా సెంటర్ ఏడాదికి 100 మెగావాట్ల విద్యుత్‌ను వినియోగిస్తుంది. ఇది ఒక లక్ష కుటుంబాలు ఏడాదికి వినియోగించే విద్యుత్‌కు సమానం. సర్వర్లు (60 శాతం), సమాచార నిల్వ వ్యవస్థలు (దాదాపు 5 శాతం), నెట్ వర్కింగ్ పరికరాల సంధానం (5 శాతం), ఐటీ పరికరాల వినియోగం (7–30 శాతం) విద్యుత్ వినియోగం పెద్ద ఎత్తున జరిగి స్థానిక విద్యుత్ వ్యవస్థకు పెద్ద అడ్డంకిగా మారుతుంది. విద్యుత్ వినియోగంలో అధిక భాగం ఉష్ణం (వేడి)గా మారుతుంది. దాంతో డేటా సెంటర్లను చల్లబరచవలసి ఉంటుంది. అందుకోసం చల్లగాలి జనరేటర్లను వాడుతున్నప్పటికీ, ప్రధానంగా ఆ ఉష్ణాన్ని నీటి ద్వారా తొలగించడం పరిపాటి. ఒక మెగావాట్ డేటా సెంటర్ కోసం ఏడాదికి 26 మిలియన్ల (రెండు కోట్ల అరవై లక్షల) లీటర్లను వినియోగించాల్సి వస్తుంది. 30 మెగావాట్ల డేటా సెంటర్ కోసం ఏడాదికి 780 మిలియన్ లీటర్ల (అంటే రోజుకు 2,19,700 లీటర్ల) నీటిని వినియోగించాలి. ఇండియాలో పట్టణ ప్రాంతాల్లో రోజుకు తలసరి 135 లీటర్ల నీరు అవసరం. అందువల్ల రోజుకు 1630 మందికి అవసరమయ్యే నీటిని ఖర్చు చేయవలసి వస్తుంది. గూగుల్ 1 గిగావాట్ (వెయ్యి మెగావాట్లు), రిలయన్స్ 1 గిగావాట్, సిఫీ-500 మెగావాట్లు, మెటా-500 మెగావాట్లు, పై-60 మెగావాట్ల లక్ష్యంగా డేటా సెంటర్లను ఏర్పాటు చేయబోతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో 6 గిగావాట్ సామర్థ్యం గల డేటా సెంటర్లు 2030 నాటికి రాబోతున్నాయి. అంటే, రోజుకు 4,39,40,000 లీటర్లకు పైగా నీటిని డేటా సెంటర్లు వినియోగించబోతున్నాయి. దాంతో డేటా సెంటర్లున్న ప్రాంతాలలో పెద్ద ఎత్తున తాగు/సాగు నీటి కొరత ఏర్పడి ప్రజా జీవనాన్ని అల్లకల్లోలంగా మార్చుతుంది. 2024లో గ్లోబల్ విద్యుత్ వినియోగంలో 1.5 శాతంగా ఉన్న డేటా సెంటర్ల విద్యుత్ వినియోగం, గత ఐదేళ్లలో ఏడాదికి 12 శాతం చొప్పున పెరిగింది. అదే సమయంలో ఇప్పటికీ విద్యుత్ ఉత్పత్తిలో బొగ్గు వినియోగం 30 శాతం, గ్యాస్ 26 శాతం, అణు శక్తి 15 శాతంగా ఉంది. డేటా సెంటర్లు 27 శాతం విద్యుత్తును ఖర్చు చేస్తుండడంతో, అది మరింత వేగంగా పెరుగుతుండడం, ఇతర పారిశ్రామిక, ప్రజా అవసరాల కోసం గ్లోబల్ విద్యుదుత్పత్తిని పెంచక తప్పని పరిస్థితి. ఇప్పటికే శిలాజ ఇంధనాల నుంచి వెలువడుతున్న హరిత వాయువులను తగ్గించుకోలేని పరిస్థితి కొనసాగుతుండగా, ఈ డేటా సెంటర్ల వల్ల కర్బన ఉద్గారాలు మరింతగా పెరిగే దుస్థితి ఏర్పడుతుంది. పెరుగుతున్న భూతాపాన్ని తగ్గించే లక్ష్యంతో వివిధ దేశాలు కార్బన్ క్రెడిట్ల లక్ష్యం కోసం అణు విద్యుత్‌పై ఆధారపడవలసిన పరిస్థితి. రాబోయే డేటా సెంటర్ల విద్యుత్ అవసరాలను తీర్చే ఉద్దేశంతో పౌర అణ విద్యుత్ రంగంలోకి ప్రైవేట్ కార్పొరేట్ సంస్థలను అనుమతించేందుకు కేంద్ర కేబినెట్ నిర్ణయం తీసుకొంది. లాభాల కోసం ప్రైవేట్ కార్పొరేట్ సంస్థలు (భోపాల్ గ్యాస్ మారణహోమం ఉదంతం) ప్రాణాంతక అణు విద్యుత్ ఉత్పత్తి రక్షణ నియమాలను తుంగలోకి తొక్కి ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడతాయనడంలో ఎలాంటి సందేహం లేదు. అత్యధిక విద్యుత్ వినియోగం, భారీగా నీటి వినియోగం, పెద్దఎత్తున డేటా సెంటర్ పరిసరాల్లో ఉష్ణం వ్యాపించడం, ప్రమాదకరమైన ఈ వ్యర్థాలు అనూహ్యమైన స్థాయిలో ఉత్పత్తి కావడం, భరించలేని శబ్ద కాలుష్యం, పర్యావరణ, ప్రజారోగ్య సమస్యలు తలెత్తడం, ఉపాధి కల్పన పరిమితంగా వుండడంతో అమెరికాలో ప్రజలు డేటా సెంటర్ల నిర్మాణానికి వ్యతిరేకంగా పెద్దఎత్తున ఉద్యమించారు. దానివల్ల దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాల్లో 64 బిలియన్ డాలర్లు పైగా మదుపుతో పెట్టబోయే డేటా సెంటర్ల నిర్మాణం రద్దయింది. అయితే ప్రజా ఉద్యమాల ధాటికి ఉత్పత్తి, ఖర్చును మించిన వ్యర్థాల పరిరక్షణ వ్యవస్థలను ఏర్పాటు చేయవలసి వస్తుంది. దీంతో లాభాల మార్జిన్ల కోసం అలాంటి 'రోగ్' పరిశ్రమలను బహుళజాతి సంస్థలు దక్షిణాది వ్యవసాయ దేశాలకు, పేద దేశాలకు తరలిస్తాయి. వెనుకబడిన, వర్ధమాన దేశాల ప్రజలకు ఆయా సంస్థల వల్ల కలిగే దుష్ప్రభావాల గురించిన సమాచారం కొరవడడం, ప్రభుత్వాలు, పాలక వర్గాలు వ్యర్థ నియంత్రణ వ్యవస్థల ఏర్పాటును పెద్దగా పట్టించుకోక పోవడం వంటివి ఇలాంటి పరిశ్రమల ఏర్పాటుకు అనుకూలమైన పరిస్థితి కల్పిస్తుంది. పైగా రాష్ట్ర పాలకులు పెద్ద ఎత్తున విదేశీ మదుపులను ఆకర్షిస్తున్నట్లుగా, అభివృద్ధి, ఉపాధి కల్పన, ఆర్థిక వికాసాన్ని తీసుకొస్తున్నట్లుగా ఫోజులు కొట్టేందుకు అవకాశం ఉంటుంది. ప్రజారోగ్యాన్ని, వ్యవసాయ-పారిశ్రామిక రంగాలను, పర్యావరణాన్ని ధ్వంసం చేసే డేటా సెంటర్లు, ఇథనాల్ ఫ్యాక్టరీలు, పెట్రో కెమికల్ రసాయనాల తయారీ, అణు విద్యుత్ కేంద్రాల ఏర్పాటు, సోలార్ ప్యానల్ తయారీ ఫ్యాక్టరీ తదితర 'రోగ్ ఫ్యాక్టరీ'ల ఏర్పాటుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రయత్నాలను ప్రజలు సంఘటితంగా తిప్పికొట్టవలసిన తరుణమిది. తస్మాత్ జాగ్రత్త.

# అద్దంకి, కందుకూరు ప్రజల ఆకాంక్ష నెరవేరింది

- మొదటి పేజి తరువాయి

కందుకూరు, అద్దంకి ప్రాంతాలను ప్రకాశం జిల్లాలో తిరిగి విలీనం చేయడం శుభపరిణామమన్నారు. ముఖ్యంగా 2012 నుంచి అద్దంకి ప్రాంత ప్రజలు తమ రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం, పాలనా సౌలభ్యం కోసం రెవెన్యూ డివిజన్ కావాలని కోరుతున్నారని, వారి విజ్ఞప్తిని మన్నించి అద్దంకిని రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ లకు కృతజ్ఞతలు తెలిపారు. ఇన్నాళ్లు బాపట్ల జిల్లా పరిధిలో ఉండటం వల్ల అద్దంకి ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని, తాజా నిర్ణయంతో ఆ కష్టాలు తీరనున్నాయని వివరించారు.

**దుర్గగుడిలో అంతరాయంపై వివరణ**

ఇటీవల విజయవాడ కనకదుర్గ ఆలయంలో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంపై మంత్రి స్పష్టత ఇచ్చారు. ఇది కేవలం అధికారుల మధ్య సమన్వయ లోపం కారణంగా జరిగిన ఘటన అని, విద్యుత్ సరఫరాలో సాంకేతిక లోపాలు లేవని స్పష్టం చేశారు. కరెంట్ కేవలం 10 నిమిషాలు మాత్రమే నిలిచిపోయిందని, విషయం తెలిసిన వెంటనే అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించినట్లు తెలిపారు. ఈ ఘటనకు బాధ్యులైన అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా ఉండేందుకు జనవరి 6 లేదా 7 తేదీల్లో దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో ఈవో, ఇతర ముఖ్య అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ చిన్న పొరపాటును ఆసరాగా చేసుకుని రాజకీయ విమర్శలు చేయడం తగదని వైసీపీ నేతలకు హితవు పలికారు. ప్రజల మనోభావాలతో ముడిపడిన అంశాలపై అనవసర రాద్ధాంతం చేయడం, ప్రతి సాధారణ విషయాన్ని రాజకీయాలకు వాడుకోవడం వైసీపీ నాయకులకు అలవాటుగా మారిపోయిందని మంత్రి మండిపడ్డారు. ఏ ధర్మాన్నైనా, సంప్రదాయాలనైనా చిత్తశుద్ధితో కాపాడేది ఒక్క కూటమి ప్రభుత్వమేనని గొట్టిపాటి రవికుమార్ ఉద్ఘాటించారు.

# గ్రూప్-2 రిజర్వేషన్లపై పిటిషన్లు కొట్టివేసిన ఏపీ హైకోర్టు... నియామకాలకు లైన్ క్లియర్

- మొదటి పేజి తరువాయి

పిటిషన్లన్నింటినీ ఏపీ హైకోర్టు కొట్టివేసింది. మంగళవారం వెలువడిన ఈ తీర్పుతో గత కొంతకాలంగా కొనసాగుతున్న ఉత్కంఠకు తెరపడింది. ఈ నిర్ణయం లక్షలాది మంది నిరుద్యోగులకు ఉపశమనం కలిగించింది. 2023లో ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) జారీ చేసిన గ్రూప్-2 నోటిఫికేషన్‌పై పలువురు అభ్యర్థులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ప్రధానంగా మహిళలు, దివ్యాంగులు, మాజీ సైనికులు (ఎక్స్-సర్వీస్‌మెన్), క్రీడాకారులకు కేటాయించిన ప్రత్యేక రిజర్వేషన్ పాయింట్లు నిబంధనల ప్రకారం లేవని పిటిషనర్లు ఆరోపించారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా రిజర్వేషన్ రోస్టర్‌ను సరిచేసి, పాత నోటిఫికేషన్‌ను రద్దు చేసి కొత్తది జారీ చేయాలని కోరారు. దీనిపై సమగ్ర విచారణ జరిపిన హైకోర్టు ధర్మాసనం.. పిటిషనర్ల వాదనలను తోసిపుచ్చు తూ తీర్పు వెలువరించింది. అన్ని పిటిషన్లను కొట్టివేయడంతో నియామక ప్రక్రియకు మార్గం సుగమమైంది. ఇప్పటికే గ్రూప్-2 ప్రిలిమ్స్, మెయిన్స్ పరీక్షలు పూర్తయిన నేపథ్యంలో, ఈ తీర్పు అభ్యర్థుల్లో కొత్త ఆశలు రేకెత్తించింది. రోస్టర్ పాయింట్ల వివాదంతో నియామకాలు ఎక్కడ ఆగిపోతాయోనని ఆందోళన చెందుతున్న అభ్యర్థులకు ఈ తీర్పు ఊరటనిచ్చింది. న్యాయప రమైన చిక్కులు తొలగిపోవడంతో ఏపీపీఎస్సీ తదుపరి నియామక ప్రక్రియను వేగవంతం చేసే అవకాశం ఉంది.

# అమిత్ షా వ్యాఖ్యల పై మమతా బెనర్జీ ఫైర్

- మొదటి పేజి తరువాయి

ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో బెంగాల్‌లో ఉగ్రవాద నెట్‌వర్క్‌లు విస్తరిస్తున్నాయంటూ అమిత్ షా వ్యాఖ్యానించడం పూర్తిగా రాజకీయ ప్రేరితమని మమత మండిపడ్డారు. బెంగాల్‌లోనే ఉగ్రవాదులు ఉంటే, పహల్గాం, ఢిల్లీ వంటి ప్రాంతాల్లో జరిగిన ఉగ్రదాడులు ఎవరు చేశారో చెప్పాలని ఆమె సూటిగా ప్రశ్నించారు. అలాగే, బెంగాల్ ప్రభుత్వం భూమి ఇవ్వకపోవడం వల్లే సరిహద్దుల్లో కంచె నిర్మాణం జరగడం లేదన్న అమిత్ షా వ్యాఖ్యలను కూడా మమత తీవ్రంగా ఖండించారు. పెట్రాపోల్, చంగ్రబంధ సరిహద్దుల్లో ఇప్పటికే తమ ప్రభుత్వం అవసరమైన భూమిని కేంద్రానికి అప్పగించిందని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సహకరించడంవల్లే అనేక రైల్వే ప్రాజెక్టులు బెంగాల్‌కు వచ్చాయని గుర్తు చేశారు. బీజేపీ నేతలు కావాలనే అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని, అలాంటి మాటలను బెంగాల్ ప్రజలు ఎప్పటికీ నమ్మరని మమత స్పష్టం చేశారు. ఇక ఎన్నికలకు ముందు కేంద్ర ప్రభుత్వం 'ఎస్ఐఆర్' పేరుతో రాష్ట్ర ప్రభుత్వాన్ని అస్థిరపర్చేందుకు కుట్ర పన్నుతోందని మమత తీవ్ర ఆరోపణలు చేశారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను ఇంత హడావిడిగా ఎందుకు చేపడుతున్నారని కేంద్రాన్ని ప్రశ్నించారు. ఎన్నికల కమిషన్ నుంచి వస్తున్న ఒత్తిడిని తట్టుకోలేక పలువురు బూత్ లెవల్ అధికారులు, ఇతర సిబ్బంది మానసిక ఒత్తిడితో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, కొందరు ఆత్మహత్యలకు కూడా పాల్పడుతున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఓటర్ల జాబితా సవరణ పేరుతో సుమారు 1.5 కోట్ల మంది పేర్లను తొలగించేందుకు ప్రయత్నం జరుగుతోందని మమత ఆరోపించారు. ముఖ్యంగా ఆదివాసీలు, అణగారిన వర్గాలను లక్ష్యంగా చేసుకుని ఈ ప్రక్రియను నడుపుతున్నారని తెలిపారు. ప్రజాస్వామ్యాన్ని బలహీనపరిచే ఇలాంటి చర్యలను తమ ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ సహించదని, బెంగాల్ ప్రజల హక్కుల కోసం చివరి వరకు పోరాడతామని మమతా బెనర్జీ స్పష్టం చేశారు.

# అనుకున్న దానికన్నా ముందుగానే దర్శనాలు ప్రారంభించాం

- మొదటి పేజి తరువాయి

వైభవంగా ప్రారంభమయ్యాయి. సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత 12:05 గంటలకు వైకుంఠ ద్వారాన్ని తెరిచి భక్తులకు అనుమతినిచ్చారు. ముందుగా ఆలయంలో ధనుర్మాస కైంకర్యాలు, ప్రత్యేక హారతులు, నివేదనలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం ఆలయ జీయంగార్లు, అర్చకులు, టీటీడీ అధికారులు, పాలకమండలి సభ్యులు సంప్రదాయబద్ధంగా వైకుంఠ ద్వార ప్రదక్షిణ చేశారు. ఈ సందర్భంగా టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు స్పందిస్తూ... "అనుకున్న సమయం కంటే ముందుగానే భక్తుల కోసం దర్శనాలు ప్రారంభించాం. ఎక్కడా చిన్న ఇబ్బంది కూడా కలగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశాం" అని వెల్లడించారు. వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శ్రీవారిని దర్శించుకున్నారు. ఆయన తన కుటుంబ సభ్యులతో కలిసి వైకుంఠ ద్వారం గుండా నడిచి స్వామివారి ఆశీస్సులు పొందారు. సీఎం రేవంత్‌కు ఆలయ మహాద్వారం వద్ద టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఇతర అధికారులు ఘన స్వాగతం పలికారు. అలాగే పలువురు కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ప్రముఖులు కూడా స్వామివారి సేవలో పాల్గొన్నారు.

ఈ వైకుంఠ ద్వార దర్శనాలు జనవరి 8 వరకు మొత్తం 10 రోజుల పాటు కొనసాగుతాయి. తొలి మూడు రోజులు కేవలం టోకెన్లు ఉన్నవారికే అనుమతి ఉంటుందని, జనవరి 2 నుంచి సాధారణ భక్తులకు కూడా అవకాశం కల్పిస్తామని టీటీడీ వర్గాలు తెలిపాయి. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని లడ్డూ ప్రసాదం, అన్నదానం, ట్రాఫిక్ నియంత్రణపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు.

# పుతిన్ నివాసంపై డ్రోన్ దాడి... తీవ్ర ఆందోళన వ్యక్తం చేసిన ప్రధాని మోదీ

- మొదటి పేజి తరువాయి

శాంతి చర్చల ప్రక్రియకు విఘాతం కలిగించేలా ఏ పక్షం కూడా వ్యవహరించకూడదని మోదీ సూచించారు. అందరూ చర్చలపైనే దృష్టి సారించాలని ఆయన కోరారు. రాత్రి వేళ, పుతిన్ ఉంటున్న నొవొగొరోడ్ ప్రాంతంపై ఉక్రెయిన్ 91 లాంగ్ రేంజ్ డ్రోన్లతో విరుచుకుపడిందని రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్ ఆరోపించారు. దీనిని ఉగ్రవాద చర్యగా ఆయన అభివర్ణించారు. అయితే రష్యా వైమానిక రక్షణ వ్యవస్థలు వాటన్నింటినీ కూల్చివేశాయని, ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం లేదా ఆస్తి నష్టం జరగలేదని 'టాస్' వార్తా సంస్థ వెల్లడించింది. ఉక్రెయిన్ దాడికి రష్యా తగిన సమాధానం చెబుతుందని లావ్రోవ్ హెచ్చరించారు. మరోవైపు రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలికేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఆయన ఆదివారం పుతిన్‌తో ఫోన్‌లో మాట్లాడగా, ఫ్లోరిడాలోని తన నివాసంలో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీతో భేటీ అయ్యారు. ఈ చర్చలు చాలా సానుకూలంగా సాగాయని, యుద్ధం ముగింపు దశకు చాలా దగ్గరగా ఉందని ట్రంప్ వెల్లడించారు. ఇలాంటి కీలక సమయంలో దాడులు జరగడం అంతర్జాతీయంగా ఆందోళన రేకెత్తిస్తోంది.

# మందులకు కూడా లొంగని డెడ్లీ ఫంగస్... గతంలో కంటే ప్రాణాంతకం!

- మొదటి పేజి తరువాయి

హెచ్చరించింది. ఢిల్లీలోని వల్లభ్‌భాయ్ పటేల్ చెస్ట్ ఇన్‌స్టిట్యూట్, అమెరికాకు చెందిన నేషనల్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ హెల్త్ (ఎన్ఐహెచ్) సంయుక్తంగా ఈ అధ్యయనాన్ని నిర్వహించాయి. ఈ ప్రమాదకరమైన ఫంగల్ ఇన్ఫెక్షన్లు ఏటా ప్రపంచవ్యాప్తంగా దాదాపు 65 లక్షల మందిపై ప్రభావం చూపుతున్నాయని పరిశోధకులు తెలిపారు. దీని తీవ్రత ఎంతలా ఉందంటే.. యాంటీ ఫంగల్ చికిత్స అందించినప్పటికీ మరణాల రేటు 50 శాతానికి పైగా ఉంటోందని పేర్కొన్నారు. ఇది బహుళ ఔషధాలను తట్టుకునే శక్తిని కలిగి ఉండటం వైద్యులను కలవరపెడుతోంది. కాండిడా ఆరిస్ మానవ చర్మంపై ఎక్కువ కాలం జీవించి ఉండగలదని, అక్కడి నుంచి శరీరంలోని ఇతర భాగాలకు వ్యాపిస్తుందని నిపుణులు వివరించారు. ఇది ఈస్ట్ నుంచి ఫిలమెంట్‌గా రూపం మార్చుకోవడం, కణాల సమూహాలను ఏర్పరచుకోవడం వంటి కణ స్థాయి వ్యూహాలతో మనుగడ సాగిస్తోందని 'మైక్రోబయాలజీ అండ్ మాలిక్యులర్ బయాలజీ రివ్యూస్' జర్నల్‌లో ప్రచురితమైన నివేదిక పేర్కొంది. చర్మంపై, అలాగే నిర్జీవ ప్రదేశాలపై కూడా ఇది గమ్ లాగా అతుక్కుపోతుందని తెలిపారు. దీనివల్ల ఆసుపత్రుల్లో చేరిన రోగుల నుంచి ఇతరులకు ఈ ఫంగస్ సులభంగా వ్యాపించే ముప్పు ఉందని హెచ్చరించారు. మరోవైపు, సాధారణ ల్యాబ్ పరీక్షల్లో ఈ ఫంగస్‌ను గుర్తించడం కష్టమని, తరచుగా దీనిని వేరే ఈస్ట్‌గా పొరబడే అవకాశం ఉందని, దీనివల్ల చికిత్స ఆలస్యమవుతోందని పరిశోధకులు వివరించారు. ఈ విపత్తును ఎదుర్కోవడానికి కొత్త రకం యాంటీ ఫంగల్ మందులు, మెరుగైన వ్యాక్సిన్లు, అధునాతన డయాగ్నస్టిక్ పరీక్షలు అందుబాటులోకి రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని వారు సూచించారు.

# ప్రపంచంలోనే రెండో అతిపెద్ద రోడ్ నెట్‌వర్క్‌గా భారత్

- మొదటి పేజి తరువాయి

అగ్రరాజ్యం అమెరికా జాతీయ రహదారుల నెట్ వర్క్ విషయంలో ప్రపంచంలోనే అగ్రస్థానంలో ఉంది.

ముఖ్యంగా భారత్ మాల పరియోజన వంటి పథకాల ద్వారా భారత్ లో హైవేల రూపురేఖలు మారిపోయాయి. 2014లో కేవలం 93 కిలోమీటర్లుగా ఉన్న యాక్సెస్-కంట్రోల్డ్ హైస్పీడ్ కారిడార్లు, ఎక్స్‌ప్రెస్ వేలు ప్రస్తుతం 3,052 కిలోమీటర్లకు పెరిగాయి. అలాగే నాలుగు లేన్ల రహదారులు 18 వేల కిలోమీటర్ల నుంచి 43,512 కిలోమీటర్లకు రెట్టింపయ్యాయి. రాబోయే మూడేళ్లలో మరో రూ.8.3 లక్షల కోట్ల విలువైన ప్రాజెక్టులను చేపట్టేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది. సామాన్య ప్రజలకు ఊరటనిచ్చేలా భద్రతా ప్రమాణాల్లోనూ కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. రోడ్డు ప్రమాద బాధితులకు 'క్యాష్‌లెస్ ట్రీట్‌మెంట్ స్కీమ్' ద్వారా రూ.1.5 లక్షల వరకు ఉచిత వైద్య సాయం అందించేలా చర్యలు తీసుకున్నారు. అలాగే ప్రమాద సమయంలో సాయం చేసే వారికి (గుడ్ సమారిటన్) ఇచ్చే పారితోషికాన్ని రూ.5 వేల నుంచి రూ.25 వేలకు పెంచారు. రవాణా రంగంలో పెట్టుబడులను ఆకర్షించేందుకు 2026 జనవరిలో పబ్లిక్ ఇన్విట్ (%×అఐ×%)ను తీసుకురానున్నట్లు అధికారులు తెలిపారు. హైడ్రోజన్ ట్రక్కుల ప్రయోగాలు, ఫాస్టాగ్ ఆధారిత టోలింగ్ వంటి ఆధునిక సాంకేతికతతో భారత రవాణా రంగం కొత్త పుంతలు తొక్కుతోంది.

# ఢిల్లీ గగనతలంపై సుదర్శన చక్రం.. శత్రువుల డ్రోన్లు, మిస్సైళ్లను నిర్వీర్యం చేయడమే లక్ష్యం

- మొదటి పేజి తరువాయి

ఈ గగనతల రక్షణ వ్యవస్థను 'సుదర్శన చక్ర %-% ఫర్ ఢిల్లీ' అనే ఫ్రేమ్‌వర్క్‌లో భాగంగా పైలట్ ప్రాజెక్ట్‌గా అమలు చేయనున్నట్లు తెలుస్తోంది. ఈ ప్రాజెక్ట్ ద్వారా దేశ రాజధాని చుట్టూ సుమారు 30 కిలోమీటర్ల పరిధిలో ఎటువంటి గగనతల ముప్పు ఎదురైనా వెంటనే గుర్తించి, అడ్డుకునే సామర్థ్యం ఈ వ్యవస్థకు ఉంటుంది. డ్రోన్లు, మిసైళ్లు, శత్రు యుద్ధవిమానాల నుంచి వచ్చే ప్రమాదాలను ముందే గుర్తించి నిర్వీర్యం చేయడమే దీని ప్రధాన లక్ష్యం. ఈ అత్యాధునిక ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్‌ను డీఆర్‌డీవో స్వదేశీ సాంకేతికతతో అభివృద్ధి చేసింది. దీని అంచనా వ్యయం సుమారు రూ.5,181 కోట్లుగా పేర్కొంటున్నారు. ఇటీవల కాలంలో డ్రోన్ల ద్వారా దాడులు, గగనతల ముప్పులు పెరుగుతున్న నేపథ్యంలో దేశ రాజధాని భద్రతపై కేంద్రం ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది.

ఇదిలా ఉండగా, భారత సైనిక సామర్థ్యాలను మరింత బలోపేతం చేసే దిశగా రక్షణ మంత్రిత్వశాఖ తాజాగా రూ.79 వేల కోట్ల విలువైన ఆయుధ సామగ్రి కొనుగోళ్లకు ఆమోదం తెలిపింది. ఈ పెద్ద ప్యాకేజీలో భాగంగానే ఢిల్లీకి సంబంధించిన ఈ గగనతల రక్షణ వ్యవస్థకు కూడా అంగీకారం తెలిపినట్లు సమాచారం.

గమనించాల్సిన విషయం ఏమిటంటే, ఈ ఏడాది స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలోనే ప్రధాని నరేంద్ర మోదీ 'సుదర్శన చక్ర' వ్యవస్థ గురించి ప్రస్తావించారు. దేశంలోని వ్యూహాత్మకంగా కీలకమైన ప్రాంతాలు, పౌర కేంద్రాలు, జాతీయ ప్రాముఖ్యత కలిగిన ప్రాంతాలను గగనతల దాడుల నుంచి రక్షించేలా బహుళ అంచెల రక్షణ కవచాన్ని ఏర్పాటు చేయడమే ఈ ప్రాజెక్ట్ లక్ష్యమని అప్పుడే ప్రకటించారు. ఈ వ్యవస్థలో భాగంగా శత్రు క్షిపణులు, యుద్ధవిమానాలను గుర్తించే అధునాతన రాడార్ వ్యవస్థలు, వాటిని మధ్యలోనే కూల్చివేసే ఇంటర్‌సెప్టర్లు, అలాగే సైబర్ యుద్ధాన్ని ఎదుర్కొనే సామర్థ్యం కూడా ఉండనుంది. డీఆర్‌డీవో, ప్రైవేట్ రక్షణ సంస్థలు, భారత సైన్యం కలిసి ఈ భారీ ప్రాజెక్ట్‌ను అమలు చేయడానికి ఇప్పటికే ప్రాథమిక సన్నాహాలు ప్రారంభించినట్లు సమాచారం. మొత్తంగా చూస్తే, ఢిల్లీ గగనతల భద్రతను ఇనుమడింపజేసే దిశగా సుదర్శన చక్ర ప్రాజెక్ట్ దేశ రక్షణ రంగంలో మరో కీలక మైలురాయిగా నిలవనుందని రక్షణ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

# గిరిజన వికాసంలో భాగంగా ఎస్టీ కాలనీలో ఉచిత ఆరోగ్యశిబిరం

పలమనేరు,పెన్ పవర్,
డిసెంబరు 30,ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆదేశాల మేరకు గిరిజన వికాసం కార్యక్రమంలో భాగంగా మంగళవారం గంగవరం మండలం, గుండుగల్లు పంచాయతీ బొమ్మనపల్లె ఎస్టీ కాలనీలో ఉచిత ఆరోగ్య శిబిరాన్ని పత్తికొండ ప్రాధమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు మల్లికార్జున రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈసందర్భంగా కాలనీ వాసులకు అన్ని రకాల వైద్యపరీక్షలు నిర్వహించి,ఉచితంగా మందులు అందించారు. ఇందులో సర్పంచ్ వెంకటరమణ,రెవెన్యూ అధికారి సుధాకర్, గ్రామస్తులు,వైద్యసిబ్బంది పాల్గొన్నారు.



పెన్ పవర్
తెలుగు దిన పత్రిక ప్రశ్నించడం మన హక్కు
రాయలసీమ
వై.ఎస్. ఆర్. కడప। కర్నూలు । అనంతపురం
అన్నమయ్య జిల్లా । నంద్యాల । సత్యసాయి జిల్లా



# వైకుంఠ ఏకాదశి మహోత్సవం నందు కోలా ఆనంద్ దంపతులు



శ్రీకాళహస్తి ,పెన్ పవర్ ,డిసెంబర్, 30 :
బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీ కోలా ఆనంద్ స్వగ్రామంలో వెలసిన శ్రీ శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వైకుంఠనాథ స్వామీ వారి ముక్కోటి ఏకాదశి రోజున అంగరంగ వైభవంగా భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీ కోలా ఆనంద్ మరియు శ్రీకాళహస్తీశ్వరా స్వామీవారి దేవస్థానం పాలక మండలి సభ్యురాలు శ్రీమతి కోలా విశాలి నేతృత్వంలో తన స్వగ్రామైన కాట్రపల్లిలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా అంగరంగ వైభవంగా పూజలు, కోలాటాల నడుమ పురవీధుల్లో ఊరేగింపులు నిర్వహించి,వచ్చిన భక్తులకు ప్రసాదాలు మరియు ప్రత్యేకించి భోజన వసతి కల్పించడం జరిగినది. భక్తులు ఉత్తర ద్వారా దర్శనం చేసుకొని స్వామీ వారి ఆశీస్సులు పొందడం జరిగింది.
ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు నంద కుమార్, గవర్ల కృష్ణయ్య, కోలా గోవర్ధన్, గ్రామస్తులు మరియు బీజేపీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు, శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.

### తిరుమల శ్రీవారి వైకుంఠ ఏకాదశి - ద్వాదశి సందర్భంగా

# కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు

**స్వయంగా పర్యవేక్షించిన జిల్లా ఎస్పీ శ్రీ ఎల్. సుబ్బరాయుడు, ఐపీఎస్.**

**తిరుమల శ్రీవారి వైకుంఠ ఏకాదశి -ద్వాదశి సందర్భంగా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు.**





తిరుపతి/పెన్ పవర్/ డిసెంబర్ 30
తిరుమల శ్రీవారి వైకుంఠ ఏకాదశి ద్వాదశి పర్వదినాలను పురస్కరించుకొని, జిల్లా ఎస్పీ శ్రీ ఎల్. సుబ్బరాయుడు, ఐపీఎస్., గారి ఆధ్వర్యంలో తిరుమలతో పాటు తిరుపతి జిల్లా వ్యాప్తంగా ఆలయాల్లో భక్తుల భద్రతను ప్రధాన అంశంగా తీసుకొని విస్తృతమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు జిల్లా పోలీస్ శాఖ తెలిపింది.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ గారు ఈరోజు ఉదయం నుండే తిరుమలలోని ఔటర్ రింగ్ రోడ్, భక్తుల ఎంట్రీ పాయింట్లు, క్యూలైన్లు తదితర కీలక ప్రాంతాలను స్వయంగా పర్యవేక్షించి, అక్కడ విధులు నిర్వహిస్తున్న పోలీస్ అధికారులు, సిబ్బందికి తగిన సూచనలు ఇస్తూ అప్రమత్తం చేశారు.ఎక్కడా చిన్న పొరపాటు కూడా జరగకుండా, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా విధులు నిర్వహించాలని ఆదేశించారు.వైకుంఠ ఏకాదశి %-% ద్వాదశి సందర్భంగా తిరుమలతో పాటు జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రధాన ఆలయాలు, స్థానిక దేవాలయాలు, రద్దీ ప్రాంతాలు వద్ద కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు, ట్రాఫిక్ నియంత్రణ, గస్తీ, నిఘా చర్యలను మరింత పటిష్టం చేశారు.భక్తులు ప్రశాంత వాతావరణంలో దర్శనాలు చేసుకునేలా పోలీస్ శాఖ పూర్తి స్థాయిలో అప్రమత్తంగా ఉండి, ఎలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా అన్ని ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా తెలిపారు



# కీలపట్ల శ్రీకోనేటిరాయుని సేవలో టీడీపీ నాయకులు



పలమనేరు,పెన్ పవర్,డిసెంబరు 30,
గంగవరం మండలం లోని తిరుమల తిరుపతి దేవస్థానం అనుబంధ ఆలయం కీలపట్ల శ్రీకోనేటి రాయస్వామిని ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా మంగళవారం పలమనేరు మరియు గంగవరం మండల టీడీపీనాయకులు స్వామివారి సేవలో పాల్గొన్నారు.వేకువ జాము నుండే ఆలయానికి భక్తుల తాకిడి ఎక్కువగా ఉండడంతో బ్రేక్ దర్శనంలో నాయకులు స్వామివారిని దర్శించి, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.అనంతరం ఆలయం బయట గాలిగోపురం వద్ద మీడియాతో మాట్లాడుతూ.. ఆదేవదేవుని ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని కోరుకొన్నట్లు తెలిపారు.ఇందులో మండల పార్టీ అధ్యక్షులు సోమశేఖర్ గౌడ్,కార్యదర్శి ప్రతాప్ కుమార్ రెడ్డి,కీలపట్ల సర్పంచ్ చంద్రశేఖర్, కల్లుపల్లె పంచాయతీ నాయకులు సురేష్ నాయుడు,పలమనేరు మున్సిపల్ కౌన్సిలర్ సుబ్రహ్మణ్యం గౌడ్ పాల్గొన్నారు.

# యుటిఎఫ్ క్యాలెండర్ల ఆవిష్కరణ



శ్రీకాళహస్తి , పెన్ పవర్ ,డిసెంబర్ ,30 :
స్థానిక సిఐటియు కార్యాలయంలో మంగళవారం యుటిఎఫ్ శ్రీకాళహస్తి డివిజన్ 2026 క్యాలెండర్లు, డైరీలను ఆవిష్కరించారు. జిల్లా కోశాధికారి మోహన్ బాబు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం యుటిఎఫ్ నిరంతరం పోరాటాలు చేస్తోందని తెలిపారు. సంవత్సర కాలంలో ప్రభుత్వం ఇచ్చే జీవోలను పుస్తక రూపంలో అందించడం జరుగుతుందన్నారు. శ్రీకాళహస్తి డివిజన్ కన్వీనర్ వెంకట కృష్ణయ్య, సీనియర్ నాయకులు శ్రీనివాసులు, సూర్య ప్రకాష్, జిల్లా కార్యదర్శులు హేమాంబరధరరావు, విజయశ్రీ, ఆడిట్ కమిటీ సభ్యులు శివకుమార్, దీపిక, గురవారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### పేదల కష్టాలు తీర్చడమే

# మా ప్రభుత్వ లక్ష్యం

### - :ఎమ్మెల్యే బొజ్జల



శ్రీకాళహస్తి , పెన్ పవర్, డిసెంబర్ ,30 :నిరుపేద వృద్ధురాలి దీనస్థితిని చూసి చలించి, బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ఆ బామ్మకు ఇల్లు కట్టించి ఇస్తానని మాట ఇవ్వడం జరిగింది.పండుగ తర్వాత స్వయంగా వచ్చి ఇల్లు ప్రారంభోత్సవం చేస్తానని భరోసానిచ్చాను. ప్రజల చిరునవ్వే మాకు బలం.

# రూపాంతర లూథరన్ దేవాలయము లో క్రిస్టమస్ ఆరాధన మహోత్సవం

కడియం పెన్ పవర్, డిసెంబర్ 30
కడియం మండలం పొట్టిలంక గ్రామంలో రూపాంతర లూథరన్ దేవాలయము లో క్రిస్టమస్ ఆరాధన మహోత్సవము వేడుకలను సంఘ ఆధ్వర్యంలో ఉదయం 11గంటల నుండి ప్రేమ విందు ఏర్పాటు చేయడం జరిగింది అధిక సంఖ్యలో విశ్వాసులు సహోదరీ సహోదరులు ప్రేమ విందు స్వీకరించడం జరిగింది సంఘ కాపరి రెవరెండ్ ఈ, నవీన్ కుమార్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. మానవాళి రక్షణకొరకు క్రీస్తు భువి పై జన్మించిన శుభదినమే క్రిస్మస్ అని అన్నారు. ఏసు క్రీస్తు జన్మ వెనుక ఉన్న అసలు సందేశాన్ని వివరించారు. ప్రేమ, క్షమ, త్యాగం, మానవత్వం వంటి విలువలు ఈ ప్రపంచానికి ఎంత అవసరమో ఆయన తన ఉపన్యాసంలో స్పష్టంగా చెప్పారు. సి ఆర్,అర్, జోషప్, సంఘ ట్రెజరర్ సంఘ పెద్దలు, స్త్రీల సమాజం, సండే స్కూల్ సమాజం, యూత్ సభ్యులు, మరియు గ్రామ సభ్యులు పాల్గొన్నారు.

# న్యూ ఇయర్‌కి రోడ్లపై పార్టీలు డీజేలు నిషేధం

### - పెళ్లకూరు సబ్ ఇన్ స్పెక్టర్...



పెళ్లకూరు, పెన్ పవర్, డిసెంబర్ 30
పెళ్లకూరు మండల ప్రజలకు సబ్ ఇన్ స్పెక్టర్ కె. నాగరాజు సందేశం ప్రజలు నూతన సంవత్సరం వేడుకలను రోడ్లపై డీజేలు పార్టీలు డాన్సులు ఇలాంటివన్నీ ప్రభుత్వం నిషేధించింది.ఎవరైనా రోడ్లపై బైక్ రేసులు తాగి వాహనాలు నడపడం జరిగితే ఖచ్చితంగా కఠిన చర్యలు ఉంటాయని ఆయన తెలిపారు. అదేవిధంగా డిసెంబర్ 31వ తేదీ బుధవారం రాత్రి పది గంటల పైన రోడ్లపై, గ్రామాలలో గుంపులుగా ఉండడం కేకలు వేయడం పక్కవారిని ఇబ్బంది పెట్టే విధంగా చేసినా కూడా చట్టపరమైన చర్యలు తప్పవని ఆయన తెలియజేశారు. ప్రజలందరూ పోలీసువారికి సహకరించి నియమ నిబంధనలకు కట్టుబడి ఉండాలని పెళ్లకూరు సబ్ ఇన్ స్పెక్టర్ కె. నాగరాజు కోరారు.

# కూటమి ప్రభుత్వంతో మారిన ఆంధ్రప్రదేశ్ ట్రెండ్



పలమనేరు,పెన్ పవర్, డిసెంబరు 30,
కూటమి ప్రభుత్వంతో ఆంధ్రప్రదేశ్ ట్రెండ్ మారిందని,ఈ ఏడాదిలో గొప్ప విజయాలను సాధించి దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఏపీ ఆదర్శంగా నిలిచిందని శాసనసభ్యులు అమర్నాథ్ రెడ్డి పేర్కొన్నారు.2025 ఏడాది కూటమి ప్రభుత్వ విజయాలపై మంగళవారం ఆయన పలమనేరు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో వివరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...రాష్ట్రంలో ఎన్నో ఆర్థిక ఒడిదుడుకులు ఉన్నప్పటికీ ఇచ్చిన హామీల మేరకు సూపర్ సిక్స్ పథకాలను సూపర్ హిట్ చేసిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. తల్లికి వందనం,స్త్రీశక్తి, ఉచిత బస్సు ప్రయాణం, అన్నదాత సుఖీభవ, ఎన్టీఆర్ భరోసా,ఆటో డ్రైవర్ల సేవలో,మెగా డీఎస్సీ,కానిస్టేబుల్ పోస్టుల నియామకం, వంటి వాటిని దిగ్విజయంగా పూర్తి చేసామన్నారు.ఇక బాబు బ్రాండ్ తో రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు వచ్చాయని ప్రపంచ దేశాలు ఆంధ్ర రాష్ట్రం వైపు చూసేలా గూగుల్ లాంటి పెద్ద కంపెనీలు ఈ ఏడాదిలో రాష్ట్రానికి వచ్చాయని వివరించారు.ఆర్థిక విధ్వంసం నుంచి అభివృద్ధి సంక్షేమం వైపు రాష్ట్రం నేడు పరుగులు తీస్తోందన్నారు.ఓవైపు రాజధాని ప్రాంత అభివృద్ధితో పాటు పోలవరం లాంటి భారీ ప్రాజెక్టుల నిర్మాణంతో పాటు హంద్రీనీవా లాంటి ప్రాజెక్టులను పూర్తి చేసిన ఘనత కూడా కూటమి ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. రాష్ట్ర ఆర్థిక అభివృద్ధి డబుల్ డిజిట్ గ్రోత్ 11.28 శాతంగా ఉందని మూలధన వ్యయం కూడా పెరిగిందన్నారు. కేంద్రంతో సమన్వయం చేసుకుంటూ దేశంలోనే ఇతర రాష్ట్రాలకు దీటుగా సంక్షేమ అభివృద్ధిలో రాష్ట్రం రాణిస్తోండడం శుభపరిణామమన్నారు. దీనికి కూటమి ప్రభుత్వ విధానాలే కారణమని ఆయన పేర్కొన్నారు. భవిష్యత్తులో కూటమి పాలనలో ఏపీ దేశంలో అన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తూ తన బ్రాండ్ ను సృష్టించ నుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.ఏదేమైనా 2025 ఏడాదిలో కూటమి ద్వారా ఏపీ గొప్ప విజయాలను సాధించిందని అయన ఆనందం వ్యక్తం చేశారు.

# శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయం వైకుంఠ ఏకాదశి వేడుకల్లో పాల్గొన్న నేతలు



నాయుడుపేట, పెన్ పవర్, డిసెంబర్ 30
నాయుడుపేట పట్టణంలోని చంద్రబాబు నాయుడు నగర్ లో వెలసి ఉన్న శ్రీదేవి,భూదేవి సమేత శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం ముక్కోటి వైకుంఠ ఏకాదశి వేడుకలు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త కామిరెడ్డి రాజారెడ్డి ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు.వైకుంఠ ఏకాదశి సందర్భంగా స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు.వైకుంఠ ఏకాదశి వేడుకల్లో పాల్గొన్న నాయుడుపేట మున్సిపల్ వైస్ చైర్మన్ జలదంకి వెంకటకృష్ణారెడ్డి,కౌన్సిలర్లు పి చంద్రారెడ్డి,పాలేటి నాగార్జున,శ్రీ పోలేరమ్మ ఆలయ కమిటీ చైర్మన్ నానబాల సుబ్బారావు, జిల్లా తెలుగు యువత ఉపాధ్యక్షులు అవధానం సుధీర్,శ్రీ పోలేరమ్మ ఆలయ కమిటీ సభ్యులు సర్వోత్తమ రెడ్డి, ఆబోతుల బాబు సాయినాయుడు, ఉచ్చూరు సంపత్ రెడ్డి,పలువురు నాయకులు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు.అనంతరం ఆలయ పూజారులు స్వామివారికి పూజలు చేసి నాయకులను ఆశీర్వదించి,తీర్థ ప్రసాదాలు అందజేశారు.

# గూడూరు మండలం ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు

**- ఎస్సై కె.ఎన్.వి సత్యనారాయణ - గూడూరు పోలీస్ స్టేషన్ సబ్-ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ , గూడూరు మండల ప్రజలకు 2026 నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేయడమైనది. ప్రతి ఒక్కరూ కుటుంబ సభ్యులతో ఆనందంగా, శాంతియుత వాతావరణంలో సంబరాలు జరుపుకోవాలని కోరుతున్నాము**

మచిలీపట్నం (పెన్ పవర్) డిసెంబర్ 30:
నూతన సంవత్సర వేడుకల సందర్భముగా ప్రజల భద్రత, శాంతి భద్రతలు పరిరక్షణ దృష్ట్యా కొన్ని నియమ నిబంధనలు పాటించవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నారు.బహిరంగ ప్రదేశాల్లో కేకులు కోయడం, ట్రాఫిక్ కి అంతరాయం కలిగించే విధంగా రోడ్లపై గుంపులు గుమికూడడం పూర్తిగా నిషేధం.రోడ్లపై లేదా పబ్లిక్ ప్లేసెస్ లో బాణాసంచా కాల్చడం, అగ్ని ప్రమాదాలకు దారి తీసే చర్యలు చేయరాదు. డీజేలు పెట్టి అధిక శబ్దంతో, సౌండ్ పొల్యూషన్ కలిగించడం చట్టపరమైన చర్యలకు లోబడి ఉంటుంది.మద్యం సేవించి వాహనాలు నడపడం, హెల్మెట్/సీట్ బెల్ట్



లేకుండా డ్రైవింగ్ చేయడం కఠినంగా నిబంధనలకు విరుద్ధం %-% డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేయబడతాయి.సైలెన్సర్ తొలగించిన బైక్స్ నడపడం, రేసింగ్, స్టంట్స్ చేయడం పట్ల కఠిన చర్యలు తీసుకోబడతాయి. వాహనాలు స్వాధీనం చేసుకునే అవకాశం ఉన్నది.రాత్రి వేళల్లో పబ్లిక్ ప్లేసెస్ లో అనుచిత ప్రవర్తన, అల్లర్లు, వేధింపులు జరిగిన పక్షంలో చట్టపరమైన చర్యలు తప్పవు.
ప్రజల సహకారంతో శాంతి భద్రతలు కాపాడుతూ అందరూ సురక్షితంగా, ఆనందంగా నూతన సంవత్సరం జరుపుకోవాలని కోరుతున్నాము. ఏవైనా అత్యవసర పరిస్థితులలో వెంటనే గూడూరు పోలీస్ స్టేషన్ ని సంప్రదించగలరు.

# మందు బాబులూ.. రికమెండేషన్లు పనిచేయవు

## - సిఐ.మోహన్ రెడ్డి హెచ్చరిక



పలమనేరు,పెన్ పవర్,డిసెంబరు 30,
డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో ఇకపై ఎవరి పేర్లు,పరిచయాలు పనిచేయవని పలమనేరు సిఐ మోహన్ రెడ్డి స్పష్టమైన హెచ్చరిక జారీచేశారు. మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడిన వెంటనే కొందరు మా డాడీ ఎవరో తెలుసా?,మా అంకుల్ ఎవరో తెలుసా? అంటూ పోలీసులపై ఒత్తిడి తెచ్చే ప్రయత్నం చేస్తుంటారని ఆయన వ్యాఖ్యానించారు. అయితే అలాంటి బెదిరింపులకు, రికమండేషన్లకు తన దగ్గర ఎలాంటి స్థానం లేదని తేల్చిచెప్పారు.సి.ఐ.తనదైన శైలిలో మాట్లాడుతూ..డ్రంక్ అండ్ డ్రైవ్ అనేది చిన్న తప్పు కాదని,అది ఇతరుల ప్రాణాలతో ఆడుకునే ప్రమాదకరమైన నేరమని పేర్కొన్నారు.మద్యం మత్తులో వాహనం నడపడం వల్ల అనేక కుటుంబాలు అనాధ లవుతున్నాయనిఅలాంటి ఘటనలను అడ్డుకోవడమే పోలీసుల ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.అందుకే ఈ విషయంలో పోలీసులు 'జీరో టాలరెన్స్' విధానాన్ని అనుసరిస్తున్నారని తెలిపారు.డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వ్యక్తుల గోప్యతను పోలీసులు గౌరవిస్తారని చెప్పారు. వారి వ్యక్తిగత జీవితంలోకి చొరబడే ఉద్దేశం తమకు లేదని స్పష్టం చేశారు.అయితే చట్టాన్ని ఉల్లంఘిస్తే మాత్రం ఎలాంటి మినహాయింపులు ఉండవని,వాహనాన్ని పక్కన పెట్టించి కేసు నమోదు చేసి, నిర్ణీత తేదీన కోర్టులోనే పరిచయం అవుతామని హెచ్చరించారు.
ముఖ్యంగా న్యూ ఇయర్ వేడుకల సందర్భంగా డిసెంబర్ 31, జనవరి 1 తేదీల్లో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు అధికంగా నమోదవుతాయని గుర్తు చేశారు.ఈ నేపథ్యంలో ముందస్తుగానే మందుబాబులకు హెచ్చరికలు జారీ చేస్తున్నామని తెలిపారు. మోతాదుకు మించి మద్యం సేవిస్తే స్టీరింగ్ పట్టకూడదని, అవసరమైతే క్యాబ్‌ను పిలవాలని,చట్టం ముందు అందరూ సమానమేనని ఆయన స్పష్టంచేశారు.

# డ్రగ్స్ బారినుండి విద్యార్థులను కాపాడటమే లక్ష్యంగా సంకల్పం కార్యక్రమం..

## -జిల్లా ఎస్పీ వకుల్ జిందల్..

పెన్ పవర్, గుంటూరు, డిసెంబర్, 30.
తాడేపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని కేఎల్ యూనివర్సిటీ కాన్ఫరెన్స్ హాల్లో గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల దుష్ప్రభావాలపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు.సంకల్పం మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా పోరాటం. అనే ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు.
ఈ కార్యక్రమానికి గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ముఖ్య అతిథిగా హాజరై, విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. డ్రగ్స్ ఉచ్చులో యువత ఎలా చిక్కుకుంటున్నారో, వాటి వల్ల కలిగే శారీరక, మానసిక, సామాజిక, న్యాయపరమైన నష్టాలపై విస్తృతంగా వివరించారు.కేఎల్ యూనివర్సిటీ వంటి ప్రతిష్టాత్మక విద్యాసంస్థలో విద్యార్థులతో మమేకమవడం సంతోషకరమన్నారు. ఇక్కడ చదవడం అదృష్టమని, ప్రతి ఒక్కరికీ ఈ అవకాశం దక్కదని, ఇక్కడి విద్య జీవితంలో ఉన్నత స్థాయికి తీసుకెళ్లే శక్తి కలిగి ఉందని పేర్కొన్నారు.
ప్రస్తుతం డ్రగ్స్ సమస్య యువతపై తీవ్ర ప్రభావం చూపుతోందని, ఇది రాష్ట్రానికే కాక దేశవ్యాప్తంగా ఎదురవుతున్న పెద్ద సవాలుగా మారిందన్నారు. ముఖ్యంగా కాలేజీ వయస్సులోనే చాలా మంది డ్రగ్స్‌కు అలవాటు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.
గతంలో డ్రగ్స్ వినియోగం మెట్రో నగరాలకే పరిమితమై ఉండేదని, కానీ ఇప్పుడు గ్రామాలు, పాఠశాలల వరకు విస్తరించడం అత్యంత ప్రమాదకర పరిణామమన్నారు.అందుకే వివిధ స్కూళ్లు, కాలేజీలు, విద్యాసంస్థల్లో సంకల్పం కార్యక్రమం ద్వారా విద్యార్థులకు డ్రగ్స్ గురించి విస్తృత అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు.
డ్రగ్స్‌కు అలవాటు పడితే అవి శారీరకంగా, మానసికంగా వ్యక్తిని పూర్తిగా బలహీనపరుస్తాయని, చివరకు నేరాల వైపు నడిపిస్తాయని హెచ్చరించారు.
డ్రగ్స్ కలిగి ఉండటం, వినియోగించడం, అమ్మడం, సరఫరా చేయడం అన్నీ ఎన్ డి పి ఎస్ చట్టం కింద తీవ్రమైన నేరాలుగా పరిగణిస్తారని తెలిపారు.
డ్రగ్స్ కేసుల్లో బెయిల్ లభించకపోవడం, 20 సంవత్సరాల వరకు జైలు శిక్ష పడే అవకాశం ఉండటం, క్రిమినల్ హిస్టరీ ఏర్పడటం వల్ల భవిష్యత్తులో ఉద్యోగాలు, పాస్‌పోర్ట్, విదేశీ అవకాశాలు అన్నీ దెబ్బతింటాయని స్పష్టం చేశారు.
చిన్న అలవాటు అనుకుని మొదలుపెట్టిన డ్రగ్స్ చివరకు జీవితాన్ని నాశనం చేస్తాయని, ప్రతి విద్యార్థికి ఉజ్వల భవిష్యత్తు ఉన్నందున ఇటువంటి ప్రమాదకర అలవాట్లకు



దూరంగా ఉండాలని సూచించారు.
గుంటూరు జిల్లాలో గడిచిన మూడు నెలల్లో సుమారు 200 మందిని డ్రగ్స్ కేసుల్లో అరెస్ట్ చేయడం జరిగిందని, సరఫరాదారులతో పాటు వినియోగదారులపైనా చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.
డ్రగ్స్‌కు అలవాటు పడిన విద్యార్థులను భవిష్యత్తు దృష్ట్యా ముందుగా కౌన్సిలింగ్ నిర్వహించి, తల్లిదండ్రుల సమక్షంలో అవగాహన కల్పించి పునరావాసం కల్పిస్తున్నామని తెలిపారు. అయితే సమస్య తీవ్రత దృష్ట్యా అవసరమైతే వినియోగదారులపై కూడా కేసులు నమోదు చేయాల్సి వస్తుందని పేర్కొన్నారు. డ్రగ్స్ సమాచారాన్ని తెలియజేసేందుకు కళాశాలలో డ్రాప్ బాక్స్ ఏర్పాటు చేస్తున్నామని, అందులో ఇచ్చే సమాచారాన్ని పూర్తిగా గోప్యంగా ఉంచి పోలీస్ శాఖ మాత్రమే చర్యలు తీసుకుంటుందని తెలిపారు. డ్రగ్స్ బారిన పడినవారిని అడిక్షన్ సెంటర్ల ద్వారా చికిత్స అందించి సాధారణ జీవనంలోకి తీసుకువచ్చే ప్రయత్నం చేస్తున్నామన్నారు.
బీ స్మార్ట్, డన్ 'టీ స్టార్ట్ " అనే నినాదంతో విద్యార్థులను డ్రగ్స్‌కు దూరంగా ఉంచేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.



ఈ సందర్భంగా కేఎల్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ బి. పార్థసారథి వర్మ గారు మాట్లాడుతూ,ఈ వయస్సులో వచ్చే తప్పుడు ఆకర్షణలు జీవితాన్ని నాశనం చేస్తాయని, తల్లిదండ్రులు ఇచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని విద్యార్థులకు సూచించారు. సంకల్పం వంటి కార్యక్రమాన్ని ప్రారంభించిన గుంటూరు జిల్లా ఎస్పీ ని హృదయపూర్వకంగా అభినందించారు.
జిల్లా అదనపు ఎస్పీ (ఏఆర్) ఏ. హనుమంతు డ్రగ్స్ వల్ల మనిషిలో వచ్చే మార్పులు, సమాజంపై దుష్ప్రభావాలను చూపే వీడియోల ద్వారా విద్యార్థులకు వివరించారు.ఈ కార్యక్రమంలో కేఎల్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ కె. సుబ్బారావు , జిల్లా అదనపు ఎస్పీలు జివి రమణమూర్తి (అడ్మిన్), ఏటీవీ రవికుమార్, హనుమంతు (ఏఆర్),
ఎస్బీ డీఎస్పీ శ్రీనివాసులు , ఎస్బీ సీఐలు అలహరి శ్రీనివాస్ ,రాంబాబు , ఐటి కోర్ సీఐ నిస్సార్ బాషా , తాడేపల్లి సీఐ వీరేంద్రబాబు , ఎస్సై కాజావలి , ఇతర పోలీస్ అధికారులు, కళాశాల యాజమాన్యం, విద్యార్థులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ నియంత్రణపై పటిష్ట చర్యలు చేపట్టండి..

## -.గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్...



???పెన్ పవర్, గుంటూరు, డిసెంబర్, 30.
గుంటూరు నగరంలో ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనార్టీస్ కమిటీ చైర్మన్ నసీర్ సూచించారు. పాత గుంటూరు పోలీస్ స్టేషన్లో పోలీస్ అధికారులతో సోమవారం ఎమ్మెల్యే నసీర్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ గుంటూరు బస్టాండ్ వద్ద ప్రైవేట్ బస్సుల కారణంగా కలిగే ట్రాఫిక్ ఇబ్బందులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. దీని కోసం నగరంలో అనువైన ప్రదేశంలో ప్రైవేట్ బస్సుల కోసం బస్టాండ్ నిర్మాణానికి చర్యలు చేపట్టాలని సూచించారు.ముగ్గురు ఎస్సైలతో కమిటీని ఏర్పాటు చేసి ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు కార్యాచరణ రూపొందించాలని చెప్పారు. ఆర్టీసీ అధికారులు కమిటీగా ఏర్పడి బస్టాండ్ వద్ద ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. గుంటూరు నగరంలో డ్రగ్స్ వద్దు బ్రో కార్యక్రమాన్ని విజయవంతం చేసిన పోలీసు అధికారులు ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ అభినందించారు. గుంటూరు నగరంలో ఎక్కడా గంజాయి మాట వినిపించకూడదన్నారు. గంజాయి వల్ల కలిగే అనర్థాలపై ఎప్పటికప్పుడు యువతను చైతన్యం చేయాలని సూచించారు. గుంటూరు నగరంలో శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా చూడాలన్నారు. అసాంఘిక కార్యకలాపాల కట్టడకి ప్రత్యేక చొరవ తీసుకోవాలని, దీని కోసం నిఘా వ్యవస్థ ఏర్పాటు చేయాలని సూచించారు.

# నగరంలో మైక్రో ప్యాకెట్స్ వారీగా నూరు శాతం ఇంటింటి చెత్త సేకరణ,చేపట్టాలి..

## - కమిషనర్ పులి శ్రీనివాసులు..

???పెన్ పవర్, గుంటూరు, డిసెంబర్, 30.
మంగళవారం ఆర్టీసి కాలనీ, రెడ్ల బజార్, బాలాజీ నగర్, యాదవ బజార్ ప్రాంతాల్లో పిజిఆర్ఎస్, డివైసిల్లో అందిన ఫిర్యాదులను, పారిశుధ్య, అభివృద్ధి పనులను పరిశీలించి సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగర పరిశుభ్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండదని, ప్రతి రోజు చెత్త సేకరణ జరగకపోతే సంబంధిత కార్మికులు, కార్యదర్శులు, ఇన్స్పెక్టర్లే భాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. రెడ్ల బజార్ నుండి డివైసికి అందిన ఫిర్యాదును క్షేత్ర స్థాయిలో పరిశీలించి, స్థానికులతో మాట్లాడి పారిశుధ్య విధుల్లో నిర్లక్ష్యంగా ఉన్నారని గుర్తించిన కార్మికులు, శానిటేషన్ కార్యదర్శిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని ప్రజారోగ్య అధికారులను ఆదేశించారు. మెయిన్ రోడ్ల స్వీపింగ్ పై అసంతృప్తి వ్యక్తం చేస్తూ, కార్యదర్శులు, ఇన్స్పెక్టర్లు నిరంతరం పర్యవేక్షణ చేపట్టి స్వీపింగ్ మెరుగ్గా జరిగేలా, స్వీపింగ్ సమయంలోనే డివైడర్లకు ఉన్న పోస్టర్స్ ని తొలగించాలని ఆదేశించారు. ప్రజలు కూడా సహకరించి తమ ఇంటిలో వచ్చే చెత్తను తడిపొడిగా వేరు చేసి, ప్రజారోగ్య కార్మికులకే అందించాలని, సమస్యలు ఉన్నచో పిజిఆర్ఎస్, డివైసిల ద్వారా ఫిర్యాదులు చేయవచ్చన్నారు. నగరంలో అనధికార బ్యానర్లు, హోర్డింగ్స్ కి అనుమతి లేదని, ఏర్పాటు చేసిన వారు, ప్రింట్ చేసిన వారిపై కూడా చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రణాళిక అధికారులు, కార్యదర్శులను ఆదేశించారు. నందివెలుగు రోడ్ నుండి సుద్దపల్లి డొంక వైపు ఉన్న రోడ్ ని విస్తరణ చేయడానికి ఆర్డీపీని సిద్ధం చేయాలని ఏసిపీని ఆదేశించారు.
పర్యటనలో ఎంహెచ్ఓ డాక్టర్ లక్ష్మీ నారాయణ, డిఈఈ హనీఫ్, ఎస్ఎస్ సాంబయ్య, అయూబ్ ఖాన్, పట్టణ ప్రణాళిక అధికారులు, సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులు పాల్గొన్నారు.







# భక్తి శ్రద్ధలతో ముక్కోటి ఏకాదశి వేడుకలు

**ఉత్తర ద్వార దర్శనమిచ్చిన భూదేవి శ్రీదేవి సమేత శ్రీ చెన్నకేశవ స్వామి**

పెన్ పవర్ కారంపూడి మండల ప్రతినిధి వెంకటేష్ 30=
ముక్కోటి ఏకాదశి పురస్కరించుకొని పల్నాడు జిల్లా కారంపూడి పట్టణంలోని శ్రీ భూదేవి శ్రీదేవి సమేత శ్రీ చెన్నకేశవ స్వామి వారు మంగళవారం భక్తులకి ఉత్తర ద్వారా దర్శనమిచ్చారు.. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు మాట్లాడుతూ ఈరోజు ఉత్తర ద్వారం దర్శనం చేసుకుంటే ముక్కోటి దేవతలు అనుగ్రహం కలుగుతుందని తెలిపారు. ఉదయం 5 గంటల నుంచి బారులు తీరిన భక్తులు వందలాదిగా పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు అనంతరం మహిళ భక్తులచే భజనా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ



సందర్భంగా దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ బడి గొడుగుల లక్ష్మీనారాయణ, దేవస్థానం నెంబర్స్, మరియు దేవాదాయ శాఖ ఈవో కొల్లి హనుమంతరావు, ఆలయ సిబ్బంది ఆధ్వర్యంలో వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు...

# రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్న తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి గౌ శ్రీ ఎ. రేవంత్ రెడ్డి గారికి ఘన స్వాగతం పలికిన జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్ ,జిల్లా ఎస్పి ఎల్. సుబ్బారాయుడు.





తిరుపతి/పెన్ పవర్/ డిసెంబర్ 29 :
తిరుపతి జిల్లా రెండు రోజుల తిరుపతి తిరుమల పర్యటన లో భాగంగా నేడు సోమవారం సాయంత్రం రేణిగుంట విమానాశ్రయం చేరుకున్న తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు గౌ శ్రీ ఎ. రేవంత్ రెడ్డి గారికి రేణిగుంట విమానాశ్రయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రివర్యులు కింజరపు అచ్చంనాయుడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక శాఖ, వాణిజ్య, ప్రణాళిక శాఖ మంత్రి వర్యులు పయ్యావుల కేశవ్, జిల్లా కలెక్టర్ డా ఎస్. వెంకటేశ్వర్, జిల్లా ఎస్పి ఎల్. సుబ్బారాయుడు, చంద్రగిరి శాసన సభ్యులు పులివర్తి నాని,తుడా చైర్మన్ దివాకర్ రెడ్డి శ్రీకాళహస్తి అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ చైర్మన్ చెంచయ్య నాయుడు,తదితరులు ఘనంగా స్వాగతం పలికారు.శ్రీకాళహస్తి ఆర్డిఓ భాను ప్రకాష్, అడిషనల్ ఎస్పీ రవి మనోహరాచారి, రేణిగుంట తహసిల్దార్ చంద్రశేఖర్, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు గౌ శ్రీ ఎ. రేవంత్ రెడ్డి గారికి స్వాగతం పలికన వారిలో వున్నారు

# నూతన సంవత్సరం-2026 సందర్భంగా జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు

### :- తిరుపతి జిల్లా ఎస్పీ శ్రీ ఎల్. సుబ్బరాయుడు, ఐపీఎస్.,

తిరుపతి/పెన్ పవర్/డిసెంబర్ 30
నూతన సంవత్సరం 2026ను జిల్లా ప్రజలందరూ బాధ్యతాయుతంగా, శాంతియుతంగా జరుపుకోవాలని తిరుపతి జిల్లా ఎస్పీ శ్రీ ఎల్. సుబ్బరాయుడు ఐపీఎస్ గారు పిలుపునిచ్చారు.ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ దృష్ట్యా నూతన సంవత్సరం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా కొన్ని ఆంక్షలు మరియు భద్రతా చర్యలు అమలు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

ముఖ్య ఆంక్షలు,చర్యలు:

జిల్లా వ్యాప్తంగా నిర్ణీత సమయానికి హెూటళ్లు, మద్యం దుకాణాలు, బార్లు, ఇతర వాణిజ్య సంస్థలు మూసివేయబడతాయి.

జిల్లా వ్యాప్తంగా ముఖ్య పట్టణాలు, ప్రధాన రహదారులపై ప్రత్యేక పోలీస్ బృందాలతో విస్తృత తనిఖీలు నిర్వహించబడతాయి.

డిసెంబర్ 31 రాత్రి మరియు జనవరి 1 తేదీల్లో జిల్లా అంతటా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగింది.

జిల్లా వ్యాప్తంగా డీజేలు, లౌడ్‌స్పీకర్ల వినియోగం, శబ్ద కాలుష్యం, అశ్లీల నృత్యాలు పూర్తిగా నిషేధించబడ్డాయి. నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేయబడతాయి.

బహిరంగ ప్రదేశాల్లో కేక్ కటింగ్, డాన్సులు, పార్టీలు, రంగులు పూయడం, టపాకాయలు కాల్చడం పూర్తిగా నిషేధించబడింది.

బైక్ రేసింగ్, అధిక వేగంతో వాహనాలు నడపడం, మద్యం సేవించి వాహనాలు నడపడం, మైనర్లకు వాహనాలు ఇవ్వడం లేదా వారు నడపడం వంటి చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలతో పాటు డ్రైవింగ్ లైసెన్స్ రద్దుకు సిఫారసు చేయబడుతుంది.

ప్రైవేట్ ప్రదేశాల్లో జరిగే కార్యక్రమాలకు ముందస్తు పోలీస్ అనుమతి తప్పనిసరి.

డిసెంబర్ 31 రాత్రి 9:00 గంటల నుండి జనవరి 1 ఉదయం 4:00 గంటల వరకు తిరుపతి నగరంలోని గరుడ వారధిపై వాహనాల అనుమతి నిరాకరించబడింది.

జిల్లా వ్యాప్తంగా ముఖ్యమైన ప్రాంతాల్లో డ్రోన్ల ద్వారా నిఘా ఏర్పాటు చేయబడింది.

చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు.

యువత తొందరపాటు చర్యలకు పాల్పడి కేసుల్లో ఇరుక్కొని తమ విలువైన భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సూచించారు.నూతన సంవత్సరం ప్రతి కుటుంబానికి పండుగలా ఉండాలి కానీ విషాదానికి దారి తీయకూడదు అని ఎస్పీ గారు విజ్ఞప్తి చేశారు.జిల్లా ప్రజలందరూ పోలీస్ శాఖకు సహకరించి, నూతన సంవత్సరం%-%2026ను



శాంతియుతంగా, సురక్షితంగా, ఆనందంగా జరుపుకోవాలని జిల్లా ఎస్పీ శ్రీ ఎల్. సుబ్బరాయుడు ఐపీఎస్ గారు ఆకాంక్షించారు

# అద్దంకిలో నూతన రెవెన్యూ డివిజన్ కార్యాలయం ఏర్పాటు

### - అద్దంకి ప్రాంత పరిపాలనలో నేడు కీలక ఘట్టం

పెన్ పవర్,డిసెంబర్ 30,అద్దంకి :
అద్దంకి ప్రాంత పరిపాలనలో కీలక ఘట్టం ఆవిష్కృతం కానుంది. ప్రజల సౌకర్యార్థం ప్రభుత్వం నూతనంగా మంజూరు చేసిన అద్దంకి రెవెన్యూ డివిజన్ కార్యాలయం రేపు ఉదయం 11 గంటలకు ఘనంగా ప్రారంభం కానుంది. అద్దంకిలోని ఆర్ అండ్ బి అతిథి గృహాన్ని ప్రస్తుతానికి డివిజన్ కార్యాలయంగా కేటాయించారు. రేపటి నుండి పరిపాలనా పనులన్నీ ఇక్కడి నుండే ప్రారంభమవుతాయి.ఈ నూతన డివిజన్ బాధ్యతలను ప్రస్తుత ఒంగోలు ఆర్డీఓ ఇంచార్జ్‌గా పర్యవేక్షిస్తారు.ఈ రెవెన్యూ డివిజన్ కార్యాలయం అందుబాటులోకి రావడం వల్ల అద్దంకి డివిజన్ పరిధిలోకి వచ్చే మండలాల ప్రజలు రెవెన్యూ పనుల నిమిత్తం ఒంగోలు వెళ్లాల్సిన అవసరం లేకుండా, స్థానికంగానే సేవలు పొందవచ్చు. ఏదైతేనేమి విధ్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ చొరవ తో అద్దంకి కి రెవిన్యూ డివిజన్ రావడం అద్దంకి నియోజకవర్గం తో పాటు దర్శి నియోజకవర్గం లోని కొన్ని మండలాలు ఈ డివిజన్ లో కలపడం ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# ఘనంగా ముక్కోటి ఏకాదశి వేడుకలు

### -ఉత్తర ద్వార దర్శనమిచ్చిన శ్రీ సింగరుట్ల లక్ష్మీనరసింహస్వామి

లిపెన్ పవర్ కారంపూడి మండల ప్రతినిధి వెంకటేష్ 30=
ముక్కోటి ఏకాదశి పురస్కరించుకొని పల్నాడు జిల్లా కారంపూడి మండలంలోని పేట సన్ని గండ్ల గ్రామ శివారులోని నల్లమల్ల అడవుల్లో వెలసిన స్వయంభు శ్రీ సింగరుట్ల లక్ష్మీ నరసింహ స్వామి ఈరోజు భక్తులకి ఉత్తర ద్వారా దర్శనమిచ్చారు.. ఈ సందర్భంగా మండల పరిధిలోని భక్తులు, సదూర ప్రాంతాల నుంచి వందలాదిగా భక్తజనులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు ఆలయ ప్రధాన అర్చకులు మారేపల్లి వెంకటరమణాచార్యులు, మారేపల్లి విజయకుమార్ వచ్చిన భక్తులందరికీ పూజా కార్యక్రమాలు నిర్వహించి, అనంతరం మహిళలచే భజనా కార్యక్రమాలు నిర్వహించారు ఈ సందర్భంగా దేవాదాయ శాఖ అధికారి శివ నాగిరెడ్డి, ఆలయ సిబ్బంది వంశంపారంపర్య బోర్డ్ చైర్మన్ గుండాల శ్రీనివాసరావు మరియు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాల, మహా అన్నదానం నిర్వహించారు...



# వ్యవసాయ భూములు ఏ మండలంలో ఉంటే ఆ మండలంలోని రైతులకు ఎరువులు పంపిణీ చేయాలి

**పేదల కు నిర్మించే గృహాలు వేగవంతంగా పూర్తి చేయాలి.-గృహ నిర్మాణంలో రాష్ట్రస్థాయిలో బాపట్ల జిల్లా టాప్ 3 లో ఉండాలి**

**ఇంటింటి నుండి చెత్త వందశాతం సేకరించాలి-జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్,**

పెన్ పవర్ బ్యూరో బాపట్ల డిసెంబర్ 30 : రైతుల వ్యవసాయ భూములు ఏ మండలంలో ఉంటే ఆ మండలంలోనే రైతులకు ఏరువులు అందజేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి. వినోద్ కుమార్ తెలిపారు.మంగళవారం సాయంత్రం స్థానిక జిల్లా కలెక్టరేట్లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ నందు ఏరువులు పంపిణీ, ప్రధానమంత్రి అవాక్ యోజన పథకం ద్వారా నిర్మించే గృహ నిర్మాణాలు,మున్సిపాలిటీ సేవలు, ఇంటింటి నుండి చెత్త సేకరణ వంటి అంశాలకు సంబంధించి మండల వ్యవసాయ అధికారులు, ఏడీలు, గృహ నిర్మాణ సంస్థ ఏఈ లు,డీఈలు, మున్సిపల్ కమిషనర్లు తో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయ రైతుల భూములు ఏ మండలంలో ఉంటే అదే మండలంలోనే రైతులకు అవసరమైన ఎరువులు పంపిణీ చేయాలని సంబంధిత మండల వ్యవసాయ అధికారులు ఆదేశించారు. వ్యవసాయ సాగు చేసి రైతులకు ఇబ్బంది లేకుండా ఎరువులు పంపిణీ చేయవలసిన బాధ్యత మండల వ్యవసాయ అధికారుల పై ఉందన్నారు. జిల్లాలో ఎక్కడైనా ఎరువులు సమస్యలు ఉంటే వెంటనే జిల్లా కలెక్టర్ దృష్టి కి తీసుకురావాలన్నారు. ఎరువులు పంపిణీ సంబంధించి ఇంకా ఇంప్రూవ్ చేయాలని మండల వ్యవసాయ అధికారులను ఆదేశించారు. ఐఎఫ్ఎమ్ఎస్ ను ప్రతిరోజు అప్డేట్ చేయాల్సిన బాధ్యత మండల వ్యవసాయ అధికారులదేనని, ఎరువులు బాగా పంపిణీ చేసిన మండల వ్యవసాయ అధికారులకు జనవరి 26వ తేదీన అవార్డులు పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా మండలాల వారీగా నిల్వఉన్న ఎరువులు వివరాలకు సంబంధించి కలెక్టర్ మండల వ్యవసాయ శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు.రాష్ట్ర స్థాయిలో గృహ నిర్మాణంలో బాపట్ల జిల్లా టాప్ 3 లో ఉండేలా గృహ నిర్మాణ శాఖ అధికారులు పనిచేయాలన్నారు. జిల్లాలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకము ద్వారా చేపడుతున్న పేదల గృహ నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేయాలని, జిల్లాలో నిర్మాణాలు చేపడుతున్న పేదల గృహాలకు సంబంధించి ఏమైనా సమస్యలు, ఇబ్బందులు ఉంటే వాటిని జిల్లా కలెక్టర్ దృష్టి కి తీసుకురావాలన్నారు. లబ్ధిదారుల బ్యాంక్ అకౌంట్ ను అప్డేట్ చేసి గృహ నిర్మాణాలు పూర్తిచేసుకునేలా వారికి అవగాహన నిర్మించాలన్నారు. గృహ నిర్మాణ కి సంబంధించి నిధులు పుష్కలంగా ఉన్నాయని, గృహ నిర్మాణాలను వేగవంతంగా పూర్తి అయ్యేలా గృహ నిర్మాణ అధికారులు



చర్యలు తీసుకోవాలన్నారు. గృహ నిర్మాణ పురోగతిలో కొన్ని మండలాలు చాలా తక్కువగా ఉండటం వల్ల వాటికి సంబంధించి గల కారణాలను తెలియజేయాలన్నారు.

మున్సిపాలిటీ లలో ప్రతి రోజు ఇంటింటి నుండి వంద శాతం చెత్తను సేకరించి వెంటనే చెత్తను డంపింగ్ యార్డ్ కు తరలించాలన్నారు, మున్సిపాలిటీల పరిధిలో చేపట్టే సేవల పై ప్రజలకు పూర్తి అవగాహన కలిగించాలన్నారు. జిల్లా కలెక్టరేట్ మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి ఇంచార్జి జిల్లా వ్యవసాయ అధికారిణి అన్నపూర్ణ గృహ నిర్మాణ సంస్థ పిడి వెంకటేశ్వరరావు బాపట్ల, చీరాల రేపల్లె అద్దంకి మున్సిపల్ కమిషనర్లు రఘునాద్ రెడ్డి, రవేంద్ర బాబు, జోసఫ్,సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

# సామాజిక సేవ అభినందనీయం,

### -దాక్షిణ్య పాఠశాల వార్షికోత్సవంలో.. ఎమ్మెల్యే నసీర్..

???పెన్ పవర్, గుంటూరు, డిసెంబర్, 30.
సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడం గొప్ప విషయమని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనార్టీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు గుంటూరు నగరంలోని దాక్షిణ్య పాఠశాల 30వ వార్షికోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే నసీర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ డాక్టర్ టీవీ రావు ఎంతో సంకల్పంతో ఏర్పాటు చేసిన దాక్షిణ్య పాఠశాల ఎందరో నిర్భాగ్యులకు అండగా నిలుస్తోందని చెప్పారు. ఈ పాఠశాల ద్వారా బధిర, ఇతర పిల్లలకు విద్యా అవకాశాలు అందిస్తూ ప్రయోజకులను చేస్తున్నారని తెలిపారు. దీంతోపాటు సామాజిక సేవా కార్యక్రమాలపై అవగాహన కల్పించడం అభినందనీయం అన్నారు. సమాజంలో అన్ని వర్గాల నిరుపేదల విద్యార్థులకు ఆశ్రయం కల్పిస్తూ వారి జీవనోన్నతికి కృషి చేస్తున్నారని తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడానికి ఎంతో మంచి మనసు ఉండాలని, ఈ విషయంలో పాఠశాల యాజమాన్యం చేస్తోన్న సేవలు ప్రతి ఒక్కరికి ఆదర్శమని చెప్పారు. ఈ పాఠశాల విద్యార్థులు ఆలపించిన గేయాలు తనను ఎంతనో మంత్రముగ్ధుల్ని చేశాయని వారి ప్రతిభ పాటవాలను ఎమ్మెల్యే నసీరచ మెచ్చుకున్నారు..




# ట్రాఫిక్ నియంత్రణపై పట్టిష్ట చర్యలు చేపట్టండి.

### -..గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్...

-పెన్ పవర్, గుంటూరు, డిసెంబర్, 30.
గుంటూరు నగరంలో ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనార్టీస్ కమిటీ చైర్మన్ నసీర్ సూచించారు. పాత గుంటూరు పోలీస్ స్టేషన్లో పోలీస్ అధికారులతో సోమవారం ఎమ్మెల్యే నసీర్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ గుంటూరు బస్టాండ్ వద్ద ప్రైవేట్ బస్సుల కారణంగా కలిగే ట్రాఫిక్ ఇబ్బందులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. దీని కోసం నగరంలో అనువైన ప్రదేశంలో ప్రైవేట్ బస్సుల కోసం బస్టాండ్ నిర్మాణానికి చర్యలు చేపట్టాలని సూచించారు.ముగ్గురు ఎస్సైలతో కమిటీని ఏర్పాటు చేసి ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు కార్యాచరణ రూపొందించాలని చెప్పారు. ఆర్టీసీ అధికారులు కమిటీగా ఏర్పడి బస్టాండ్ వద్ద ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. గుంటూరు నగరంలో డ్రగ్స్ వద్దు బ్రో కార్యక్రమాన్ని విజయవంతం చేసిన పోలీసు అధికారులు ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ అభినందించారు. గుంటూరు నగరంలో ఎక్కడా గంజాయి మాట వినిపించకూడదన్నారు. గంజాయి వల్ల కలిగే అనర్థాలపై ఎప్పటికప్పుడు యువతను చైతన్యం చేయాలని సూచించారు. గుంటూరు నగరంలో



శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా చూడాలన్నారు. అసాంఘిక కార్యకలాపాల కట్టడకి ప్రత్యేక చొరవ తీసుకోవాలని, దీని కోసం నిఘా వ్యవస్థ ఏర్పాటు చేయాలని సూచించారు.

# జనవరి నుండి అద్దంకి నియోజకవర్గం మరలా ప్రకాశం జిల్లాలోనే

**- 28 మండలాలతో ప్రకాశం జిల్లా ఏర్పాటు**

**- కొరిశపాడు, జె పంగులూరు, అద్దంకి, బల్లికురవ, సంతమాగులూరు, ముండ్లమూరు, తాళ్లూరు, దర్శి, దొనకొండ, కురిచేడు మండలాలతో అద్దంకి రెవెన్యూ డివిజన్ ఏర్పాటు**

పెన్ పవర్,డిసెంబర్ 30, అద్దంకి :
రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 29వ తేదీన జరిగిన రాష్ట్ర క్యాబ్ నెట్ సమావేశం లో ఏపీ జిల్లాల పునర్విభజన ప్రతి పాదనలకు ఆమోదం తెలపడంతో పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా పరిధిలోని కందుకూరు నియోజక వర్గాన్ని, బాపట్ల జిల్లాలోని అద్దంకి నియోజక వర్గాన్ని మరలా ప్రకాశం జిల్లాలో 28 మండలాలతో కలిపి ప్రకాశం జిల్లా ను పునర్వ్యవస్థీకరిస్తూ మంగళవారం జిఓ ఎంఎస్. నెం.523ను జారిచేసినట్లు జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు ప్రకటనలో తెలిపారు. కందుకూరు, లింగసముద్రం, గుడ్లూరు, ఉలవపాడు, వలేటివారిపాలెం, మర్రిపూడి, పొన్నలూరు మండలాలతో కూడిన కందుకూరు రెవెన్యూ డివిజన్ ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఒంగోలు రెవెన్యూ డివిజన్లో కొండపి, జరుగుమల్లి, సింగరాయకొండ, ఒంగోలు అర్బన్, ఒంగోలు రూరల్, కొత్తపట్నం, సంతనూతలపాడు, నాగులుప్పలపాడు, మద్దిపాడు, చీమకుర్తి, టంగుటూరు మండలాలు ఉంటాయని పేర్కొన్నారు. కొరిశపాడు, జే పంగలూరు, అద్దంకి, బల్లికురవ, సంతమాగులూరు, ముండ్లమూరు, తాళ్ళూరు, దర్శి, దొనకొండ, కురిచేడు మండలాలతో అద్దంకి రెవెన్యూ డివిజన్ ను ఏర్పాటుచేస్తున్నట్లు ఆయన వివరించారు.




# భారతీయ జనతా పార్టీ గుంటూరు జిల్లా కిసాన్ మోర్చా జిల్లా కమిటీ నియామకం..

పెన్ పవర్, గుంటూరు, డిసెంబర్, 30.
బిజెపి జిల్లా కార్యాలయం నందు భారతీయ జనతాపార్టీ గుంటూరు జిల్లా కిసాన్ మోర్చా జిల్లా కమిటీని కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు తుల్లిమిల్లి శ్రీనివాసరావు జిల్లా అధ్యక్షులు చెరుకూరి తిరుపతిరావు సమక్షంలో నియామకం చేశారు

ఈకార్యక్రమానికి బిజెపి జిల్లా అధ్యక్షులు చెరుకూరి తిరుపతిరావు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ రైతే దేశానికి వెన్నుముక అని, ప్రతి గ్రామస్థాయి నుంచి కిసాన్ మోర్చాను బలోపేతం చేయాలని కోరారు..

బిజెపి కిసాన్ మోర్చా జిల్లా కమిటీ నియామకం

కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు తుల్లిమిల్లి శ్రీనివాసరావు జిల్లా ఉపాధ్యక్షులుగా ఆరె కోటి చంద్రశేఖర్ రెడ్డి తోట శంకర్రావు మంచికలపూడి గంగాధరరావు వేజెండ్ల రోశయ్య జిల్లా ప్రధాన కార్యదర్శులుగా కాండ్రు భాను కిషోర్ మరియు తన్నీరు శివరామకృష్ణ కార్యదర్శులుగా జూటూరి మురళిశెట్టి శ్రీరామయ్య వెలువలు సుబ్బారావు బిల్లల సుధాకర్ మరియు తదితర కార్యవర్గ సభ్యులను నియమించడం జరిగింది



# పొదిలి ఎరువుల వ్యాపారి కోటేశ్వరరావు అవినాష్ పై పోలీసుల దాడిని ఖండించిన ఆప్స్ వ్యవస్థాపకులు డా. కొల్లూరి !

మచిలీపట్నం (పెన్ పవర్) డిసెంబర్ 30: ప్రకాశం జిల్లా పొదిలి ఎరువుల ఎరువుల వ్యాపారులైన తండ్రి యాదాల కోటేశ్వరరావు కుమారుడు అవినాష్ పై పొదిలి పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ వేమన చేసిన దాడిని ఖండించిన అఖిల భారత ఆర్యవైశ్యుల పరిరక్షణ సమితి (ఆప్స్) వ్యవస్థాపకులు డా. కొల్లూరి సత్యనారాయణ (చిన్న) ఈ సందర్భంగా డా. కొల్లూరి మాట్లాడుతూ పొదిలిలో ప్రముఖ ఎరువుల వ్యాపారి అవినాష్ షాపు ముందు ఎరువులను దింపటానికి ఆగిన లారీ ట్రాఫిక్ జామ్ అయిందని విచక్షణారహితంగా అవినాష్ పై దాడి బలవంతంగా పోలీస్ జీపు ఎక్కించి జీపులో తన్నుకుంటూ పోలీస్ స్టేషన్ కు తీసుకెళ్లిన సబ్ ఇన్స్పెక్టర్ వేమన తండ్రి కోటేశ్వరరావు స్టేషన్ కి వెళ్లి ఎందుకు మా అబ్బాయిని కొట్టి పోలీస్ స్టేషన్ కు తీసుకువచ్చారు అని ప్రశ్నించగా కోటేశ్వరరావు ని కూడా కొట్టిన ఎస్సై వేమన పద్ధతి సరికాదని జరిగిన సంఘటనను డా. కొల్లూరి ఖండించారు. సమాజంలోని ప్రజలకు నిస్వార్ధ సేవలు అందించే ఆర్యవైశ్య వ్యాపార కుటుంబంపై ఎస్సై వేమన చేసిన దాడిపై పోలీస్ ఉన్నత అధికారులుచే విచారణ చేపట్టి ఎస్సై వేమన పై తగు చర్యలు తీసుకోవాలని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర డి జి పి హరీష్ కుమార్ గుప్తా ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హెూం శాఖ మంత్రివర్యులు వంగలపూడి అనిత తదితరులకు డా. కొల్లూరి విజ్ఞప్తి చేశారు.



ఎరువుల వ్యాపారులు కోటేశ్వరరావు అవినాష్ లపై దాడిని ఖండించిన వారిలో ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ కృష్ణాజిల్లా అధ్యక్షులు మామిడి ప్రసాద్ ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ ఉపాధ్యక్షులు ఉదయగిరి గోపాల్ కృష్ణాజిల్లా ఆర్యవైశ్య సంఘం అధికార ప్రతినిధి చిట్టూరి పశుపతినాథ్ బాబు పెడన మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు దేసు శ్రీనివాస్ వర్తక వాణిజ్య మండలి వైస్ చైర్మన్ చిలకల శ్రీనివాస్ గుప్తా పెడన మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు దేసు శ్రీనివాస్ శ్రీ వాసవి మహిళా మండలి అధ్యక్షురాలు మామిడి సావిత్రి కేసిజిఎఫ్ వాసవి క్లబ్ పొట్టి శ్రీరాములు పెడన అధ్యక్షురాలు కొమ్మూరి విజయదుర్గ తదితరులు ఉన్నారు.

# వైకుంఠ ఏకాదశి సందర్భంగా శ్రీ వాసవి క్షేత్రానికి పోటెత్తిన భక్తులు !

మచిలీపట్నం (పెన్ పవర్) డిసెంబర్ 30: పవిత్ర ధనుర్మాసాన్ని పురస్కరించుకుని వైకుంఠ ఏకాదశి సందర్భంగా పెడన శ్రీ వాసవి క్షేత్రానికి పోటెత్తిన భక్తులు ఈ సందర్భంగా ఉత్తర ద్వార మార్గాన శ్రీ వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్న భక్తులు ఈ సందర్భంగా పెడన ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు డా. కొల్లూరి చిన్న మంజులత దంపతులతో పాటు కేసిజిఎఫ్ వాసవి క్లబ్ పొట్టి శ్రీరాములు పెడన అధ్యక్షురాలు కొమ్మూరి విజయదుర్గ చంద్రశేఖర్ దంపతులచే శ్రీ వెంకటేశ్వర స్వామి వారికి ప్రత్యేక పూజలు18 రకముల ద్రవ్యములతో అభిషేకములను శ్రీ వాసవి క్షేత్రం ఆలయ ప్రధాన అర్చకులు స్వర్ణ సాయిబాబు అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ వాసవి మహిళా మండలి కేసిజిఎఫ్ వాసవి క్లబ్ పొట్టి శ్రీరాములు పెడన సంయుక్త ఆధ్వర్యంలో కార్యవర్గ సభ్యులు గోవింద నామాలు విష్ణు సహస్రనామం



భగవద్గీత తిరుప్పావై పారాయణలను అత్యంత భక్తిశ్రద్ధలతో చదివారు. వేకువ జాము నుండి అధిక సంఖ్యలో విచ్చేసి శ్రీ వెంకటేశ్వర స్వామివారిని దర్శించుకున్న భక్తులకు పట్టణ ఆర్యవైశ్య సంఘం వారు తీర్థ ప్రసాదములు అందజేశారు. పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు డా. కొల్లూరి చిన్న పర్యవేక్షణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం



ఆర్గనైజింగ్ కార్యదర్శి కొల్లూరి రాజా కార్యదర్శి జవ్వాజి నాగు సభ్యులు ఉదయగిరి గోపాల్ శ్రీ వాసవి మహిళా మండలి అధ్యక్షురాలు మామిడి సావిత్రి ప్రధాన కార్యదర్శి కొల్లూరి పద్మ కోశాధికారి కొమ్మూరి సుమన కే సి జి ఎఫ్ వాసవి క్లబ్ పొట్టి శ్రీరాములు పెడన ప్రధాన కార్యదర్శి జవ్వాజి మాధవి కోశాధికారి తమ్మన అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

# రెవెన్యూ క్లినిక్ కార్యక్రమం ద్వారా రెవెన్యూ సమస్యలకు పరిష్కారం - జిల్లా కలెక్టర్ డీకే. బాలాజీ






మచిలీపట్నం (పెన్ పవర్) డిసెంబరు 30: రెవెన్యూ క్లినిక్ కార్యక్రమం ద్వారా జిల్లాలో రెవెన్యూ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ తెలిపారు. మంగళవారం సాయంత్రం సీసీఎల్ఏ ముఖ్య కార్యదర్శి జి.జయలక్ష్మి అమరావతి రాష్ట్ర సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్లతో పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ, పాత పత్రాల డిజిటలైజేషన్, రెవెన్యూ క్లినిక్ తదితర రెవెన్యూ అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ కలెక్టరేట్లోని వారి చాంబర్ నుంచి జాయింట్ కలెక్టర్ ఎం నవీన్ తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, జిల్లాలో నిర్వహిస్తున్న రెవెన్యూ క్లినిక్ కార్యక్రమం గురించి వివరించారు. కలెక్టరేట్లో సోమవారం 5 కౌంటర్లు ఏర్పాటు చేశామని, అందులో దరఖాస్తుల పరిశీలన, సలహా సూచనల విభాగము, 22-ఏ సమస్యలు, భూసేకరణ సంబంధిత సమస్యలు, ఆర్ఓఆర్ పట్టాదారు పాసుపుస్తకాలు, సుమోటో అడంగల్ కరెక్షన్ సంబంధిత సమస్యలు, రీ సర్వే, విస్తీర్ణం తేడా, జాయింట్ ల్యాండ్ పార్సల్ మ్యాప్ (ఎల్పిఎం) సంబంధిత సమస్యలు, ఇతర రెవెన్యూ సమస్యల విభాగాలతో కౌంటర్లు ఏర్పాటు చేసి ప్రజల నుంచి పలు అర్జీలు స్వీకరించి వాటిలో కొన్నిటిని పరిష్కరించినట్లు తెలిపారు. రానున్న కాలంలో కార్యక్రమాన్ని మరింత సమర్థవంతంగా నిర్వహించి ప్రజల రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని సీసీఎల్ఏ ముఖ్య కార్యదర్శికి తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో కలెక్టరేట్ రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# ఒప్పిచర్ల హరిజన కాలనీవాసుల వినతి

## - తాసిల్దార్ ఆదేశాలతో భూ కబ్జాలపై విచారణ



పల్నాడు జిల్లా కారంపూడి మండలం ఒప్పిచర్ల గ్రామంలోని హరిజన కాలనీవాసులు, తమ కాలనీ సమీపంలో చర్చి ఎదురుగా ఉన్న భూమిని కొంతమంది అక్రమంగా కబ్జా చేస్తున్నారంటూ కారంపూడి తాసిల్దార్ వెంకటేశ్వర్ల నాయక్‌కు మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈ ఫిర్యాదుపై తక్షణమే స్పందించిన తాసిల్దార్ వెంకటేశ్వర్ల నాయక్, విచారణ జరపాలని వీఆర్వో ప్రభాకర్‌కు ఆదేశాలు జారీ చేశారు. ఆయన ఆదేశాల మేరకు మంగళవారం వీఆర్వో ప్రభాకర్ ఒప్పిచర్ల గ్రామంలో విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా భూమిని కబ్జా చేసిన వారిని పత్రాలు చూపాలని అడగగా, తమ వద్ద ఎలాంటి ధృవీకరణ పత్రాలు లేవని వారు స్పష్టం చేసినట్లు తెలిపారు. హరిజన కాలనీవాసులు మాట్లాడుతూ, సర్వే నెంబర్లు 708/1, 711 పరిధిలోని సుమారు 170 సెంట్ల భూమిని 2002లో 35 ప్లాట్లుగా కేటాయించారని తెలిపారు. ఈ భూమి చర్చికి, పిల్లలు ఆడుకునేందుకు లేదా పాఠశాల నిర్మాణానికి ఉద్దేశించిన స్థలమని పేర్కొన్నారు. అక్రమ కబ్జాల వల్ల తమ హక్కులు హరించబడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో తాసిల్దార్ తమపై దయచూపి న్యాయం చేయాలని హరిజన కాలనీవాసులు కోరారు. భూ వివాదంపై అధికారులు తీసుకునే నిర్ణయ పై కాలనీవాసులు ఆతృతగా ఎదురుచూస్తున్నారు.





# పదవ తరగతి విద్యార్థులకు ప్రతిభా పాఠవ పరీక్ష

పెన్ పవర్, డిసెంబర్ 30,అద్దంకి: విద్యోన్నతి ఫౌండేషన్ వారి నాలుగవ ప్రతిభ పరీక్షను ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతి చదువుతున్న ప్రతిభవంతుల విద్యార్థులను అద్దంకి, జె పంగులూరు ,ఇంకొల్లు మూడు మండలాలలో ప్రతిభవంతులైన విద్యార్థులను ఎంపిక చేసి స్కాలర్ షిప్ ఇవ్వటం జరుగుతుందిని అందుకు ప్రతిభా పరీక్ష జనవరి నాలుగో తారీఖున ఆదివారం నాడు ఆయా మండలాల కేంద్రములలో ఎంపిక చేసిన ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉదయం 10 గంటలకు పరీక్ష నిర్వహించడం జరుగుతుందని విద్యోన్నతి ఫౌండేషన్ డైరెక్టర్ దూళిపాళ్ల వీరనారాయణ తెలిపారు . హాజరయ్యే విద్యార్థులు ఉదయం 9. 30 గంటలకు తప్పనిసరిగా ఆయా పాఠశాల లోని పరీక్ష కేంద్రాలకు హాజరు కావాలని తెలిపారు . ప్రతి మండలం నుండి అయిదుగురు చొప్పున మూడు మండలాలకు 15 మంది చొప్పున ప్రథమ, ద్వితీయ రెండు సంవత్సరాలు కలిపి ప్రతి విద్యార్థికి పదివేల రూపాయలు చొప్పున మొత్తం స్కాలర్షిప్ మూడు లక్షల రూపాయలు స్కాలర్షిప్స్ విద్యార్థులకు అందజేయడం జరుగుతున్నదన్నారు. ఈ సంవత్సరం అదనంగా దాతల సహకారంతో మరో నలుగురు విద్యార్థులకు స్కాలర్షిప్ ఇవ్వటం జరుగుతుందని తెలిపారు .

మీడియా సమావేశంలో విద్యోన్నతి ఫౌండేషన్ డైరెక్టర్ దూళిపాళ్ల వీరనారాయణ, బుద్ధిస్ట్ సొసైటీ జిల్లా ఉపాధ్యక్షులు తాళ్లూరు బాబురావు, రొటేరేన్ మరియు రిటైర్డ్ పోస్ట్మాస్టర్ మల్లాది శ్రీనివాసరావు అద్దంకి పట్టణ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు మన్నం త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు

# చిల్ల చెట్లు వేలం పాట ద్వారా ఆదాయం రూ.4.10లక్షలు

వలేటివారిపాలెం పెన్ పవర్, డిసెంబర్ 30, మండలంలోని నలదలపూరు పంచాయతీ పరిధిలోని ప్రభుత్వ భూములు, కుంటలలోని చిల్ల చెట్లు వేలం పాట ద్వారా ఆదాయం రూ. 4,10,000లు వచ్చిట్టు డిప్యూటీ ఎంపీడీవో రాంబాబు తెలిపారు. స్థానిక గ్రామ సచివాలయంలో సర్పంచి దువ్వూరి కృపమ్మ అధ్యక్షతన బహిరంగ వేలం పాటను మంగళవారం నిర్వహించారు. 17 మంది వేలం పాటలో పాల్గొనగా ఊటుకూరి కోటేశ్వరరావు అత్యధికంగా రూ. 4. 10లక్షలకు పాడి దక్కించుకున్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి యు.వెంకటేశ్వరరావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.




# నేడు 7 గంటల నుండి యన్ టి ఆర్ పెన్షన్లు పంపిణీ

## -జిల్లాలో 2,25,485 మందికి వివిధ రకాల పింఛన్లు,రూ.96.57 కోట్లు

## -జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్

పెన్ పవర్ బ్యూరో బాపట్ల డిసెంబర్ 30




రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న యన్ టి ఆర్ భరోసా ఫించన్లు బుధవారం రోజున పంపిణీ చేయడం జరుగుతున్నదని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు 2026 జనవరి 1 వ తేదీ (నూతన సంవత్సరం కారణంగా) 2026 జనవరి 1 న పంపిణి చేయవలసిన పెన్షన్లు బుధవారం ఉదయం 7 గంటల నుండి పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. బాపట్ల జిల్లా లో జనవరి, 2026 నెలలో 2,25,485 మందికి వివిధ రకాల పొందుతున్న ఫించన్ దారులకు రూ. 96.57 కోట్ల పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. మంగళవారం రోజే సచివాలయ సిబ్బంది బ్యాంకు ల నుండి నగదు డ్రా చేసుకోవడం జరిగిందని, బుధవారం ఉదయం 7 గంటల నుండి పింఛన్లు పంపిణీ చేయడం జరుగుతుంది. బుధవారం రోజు వంద శాతం పెంచన్లు పంపిణీ చేయాలన్నారు. అనివార్య కారణం ల చేత బుధవారం రోజు తీసుకోని వారికి 2 వ తేదీ శుక్రవారం రోజు పంపిణీ చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇవ్వడం జరిగిందని కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

# ఆల్ ఇండియా యూత్ కాంగ్రెస్ పార్టీ ఎలక్షన్స్ సిద్ధం:- జడ్ అర్ ఓ వెంకటేష్

పెన్ పవర్ బ్యూరో బాపట్ల డిసెంబర్ 30

ఆల్ ఇండియా యూత్ కాంగ్రెస్ పార్టీ యువ నాయకత్వానికి స్వాగతం పలుకుతుందని జడ్ అర్ ఓ టి వెంకటేష్ పేర్కొన్నారు. మంగళవారం ఉదయం స్థానిక యన్ జి ఓ హెూమ్ నందు బాపట్ల జిల్లా కాంగ్రెస్ పార్టీ,పిసిసి రాష్ట్ర కార్యదర్శి గంటా అంజిబాబు ఆదేశాలు మేరకు విలేకర్ల సమావేశం నీర్వహించారు. ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్ నాయకులు టి వెంకటేష్ మాట్లాడుతూ,దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ యూత్ ను నాయకత్వ లక్షణాలు తో రాజకీయాలకు స్వాగతం పలుకుతుందన్నారు. యూత్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష,కార్యదర్శులుగాను, పార్టీ సభ్యులుగా చేరే వారు సభ్యత్వ నమోదు చేసుకోవాలన్నారు. అలాగే యూత్ లీడర్ లుగా పోటీ చేసే అభ్యర్థులు 18సంవత్సరాల నుండి 35 సంవత్సరాలు నిండి ఉండాలన్నారు. వయస్సు నిర్ధారణ కొరకు పదవతరగతి టి సి,లేదా డ్రైవింగ్ లైసెన్స్,,పాన్ కార్డు జిరాక్స్ అందజేయవలసి ఉంటుంది అని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల అధికారి వెంకటేశ్ స్పష్టం చేశారు. ఎన్నికలన్నీ కూడా పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు మీడియాకు తెలిపారు. అదేవిధంగా నియోజకవర్గం, జిల్లా,రాష్ట్ర యూత్ కు కాంగ్రెస్ పార్టీ స్వాగతం పలుకుతున్నందున యువతి , యువకులు ఈ అవకాశం ను సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కాంగ్రెస్ పార్టీ నాయకులు టి.వెంకటేష్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రచార కార్యదర్శి శీలం సాగర్,ధోనిపూడి రవిబాబు,మేడిబోయిన గిరి రెడ్డి, బక్కా రోశయ్య,మున్నం పాల్ రెడ్డి,ఏ.ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.....



# ఘనంగా వైకుంఠ ఏకాదశి వేడుకలు





పెన్ పవర్,డిసెంబర్ 30, అద్దంకి : ముక్కోటి ఏకాదశి( వైకుంఠ ఏకాదశి ) సందర్భంగా ఎంతో విశిష్టత గల కాకాని పాలెం శ్రీ రంగనాయక స్వామి దేవాలయం నందు మంగళవారం ఉదయం నాలుగు గంటల నుండి భక్తులు పోటెత్తినారు. ముక్కోటి ఏకాదశి సందర్భంగా ప్రత్యేకమైన ఉత్తర ద్వారా దర్శనం చేసుకొనుటకు అద్దంకి పట్టణ పరిసర గ్రామ ప్రజలు విరివిగా దేవాలయం దగ్గర నుండి దాదాపుగా నామ రోడ్డు వరకు భక్తులు పోటెత్తి క్యూలో నిలబడి ఉత్తర ద్వార దర్శనం చేసుకొని తీర్థ ప్రసాదములు స్వీకరించారు. బాపట్ల జిల్లా ఆర్డీవో, అద్దంకి మండల తహసిల్దార్, సీఐ ఏ సుబ్బరాజు, టెంపుల్ ఈవో శైలేంద్ర కుమార్,,ఎస్సై, వీఆర్వో శంకర్, ఎక్స్ ఏపీపీ అడ్వకేట్ఎం సుభాష్ బాబు, వంశి, సాయిరాం, పేరయ్య, కిట్టు, గంగాధర్ మొదలవారు సుమారు 6000 మందికి పైగా భక్తులు దర్శించుకున్నారు.

# పేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న సంస్థ సభ్యులు సుజన్ రాజ్ కుమార్:




పెన్ పవర్ బ్యూరో బాపట్ల డిసెంబర్ 30

పేదలను ఆదుకునేందుకు తమ సంస్థ పని చేస్తుందని డైలీ బ్రేడ్ మిషన్స్ స్వచ్ఛంద సంస్థ పనిచేస్తున్నదని అధ్యక్షులు జిడుగు రాజా రత్నమ్ అన్నారు బాపట్ల పట్టణం లోని ఉమ్మారెడ్డి సరోజిని కాలనీ డైలీ బ్రేడ్ మిషన్స్ స్వచ్ఛంద సేవా సంస్థ వద్ద మంగళవారం బేతని కాలనీ లో నివసిస్తున్న కుష్టు వ్యాధిగ్రస్తులకు రాజారత్నం నిత్యావసర సరుకులు ఉచితంగా పంపిణీ చేశారు తమ సంస్థ ద్వారా ప్రతి నెల పేదలకు సరుకులు పంపిణీ చేస్తామన్నారు ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు సుజన్,రాజకుమార్,సునీత తదితరులు పాల్గొన్నారు

# వంట నూనెను పదే పదే వేడి చేసి వాడుతున్నారా?



**హైదరాబాద్ పెన్ పవర్:** భారతీయ ఇళ్లలో వంట నూనె లేని రోజు ఉండదు. పచ్చడి, పులుసు, కూరలు, చిరుతిళ్లు – ఏ వంటకమైనా నూనెతోనే మొదలవుతుంది. ముఖ్యంగా డీప్ ఫ్రై చేసే పదార్థాల తర్వాత మిగిలిన నూనెను వడకట్టి మళ్లీ వాడేస్తుంటారు చాలా మంది. డబ్బు ఆదా అవుతుందని భావిస్తారు. కాచిన నూనెను మళ్లీ వాడే అలవాటు ఆరోగ్యానికి ఎంత ప్రమాదమో తెలుసా? పదే పదే వేడి చేసిన నూనెలో విషపదార్థాలు ఏర్పడతాయని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇవి శరీరంలోకి చేరి ఏం చేస్తాయి? ఏ రోగాలకు దారి తీస్తాయి? చాలా మంది ఇళ్లలో డీప్ ఫ్రై చేసిన నూనెను నిల్వ చేసుకుని మరుసటి రోజు కూడా వాడతారు. ఇది సాధారణ అలవాటుగా మారింది. కానీ, ఈ ప్రక్రియలో నూనెలో రసాయన మార్పులు జరుగుతాయి. అధిక ఉష్ణోగ్రతకు గురైన నూనెలో ఫ్రీ రాడికల్స్, ట్రాన్స్ ఫ్యాట్స్, ఆల్డిహైడ్స్ వంటి హానికర సమ్మేళనాలు పెరుగుతాయి. ఇవి శరీరంలో ఆక్సీకరణ ఒత్తిడిని పెంచి, కణాలను దెబ్బతీస్తాయి. ఫలితంగా గుండె జబ్బులు, డయాబెటిస్ వచ్చే అవకాశం ఉంది? మరి ఈ ప్రమాదం నుంచి ఎలా తప్పించుకోవాలి? నూనెను పదే పదే వేడి చేయడం వల్ల దానిలోని కొవ్వు ఆమ్లాలు విచ్ఛిన్నమై ఫ్రీ రాడికల్స్‌ను విడుదల చేస్తాయి. ఈ ఫ్రీ రాడికల్స్ శరీరంలోకి చేరి కొలెస్ట్రాల్‌ను పెంచుతాయి, ట్రైగ్లిజరైడ్స్ స్థాయులను అసమతుల్యం చేస్తాయి. ధమనుల్లో ప్లాక్ పేరుకుపోవడం, వాపులు పెరగడం, ఇన్సులిన్ నిరోధకత పెరగడం వంటివి జరుగుతాయి. కాలక్రమేణా ఇవి గుండె జబ్బులు, టైప్-2 డయాబెటిస్, ఫ్యాటీ లివర్, క్యాన్సర్ వంటి దీర్ఘకాలిక వ్యాధులకు దారి తీస్తాయి. పరిశోధనల ప్రకారం.. అధిక ఉష్ణోగ్రతలకు గురైన నూనెలో పాలీసైక్లిక్ ఆరోమాటిక్ హైడ్రోకార్బన్స్‌వంటి కార్సినోజెన్స్ కూడా ఏర్పడతాయి. వాడిన నూనెను నిల్వ చేసే విధానంలోనూ చాలా మంది తప్పులు చేస్తారు. మూత పెట్టకుండా, వెలుతురు పడే చోట ఉంచితే ఆక్సీకరణ వేగంగా జరిగి ఫ్రీ రాడికల్స్ మరింతగా పెరుగుతాయి. మళ్లీ వాడాలనుకుంటే తాజా నూనెతో కలిపి వాడవచ్చు కానీ, అందులోని విష సమ్మేళనాలు పూర్తిగా తొలగిపోవు. పొద్దుతిరుగుడు నూనెకు బదులుగా పల్లి నూనె, ఆవ నూనె (మస్టర్డ్ ఆయిల్), కొబ్బరి నూనె, నెయ్యి వంటివి ఉపయోగించండి. ఇవి హై స్మోక్ పాయింట్ ఉండి, డీప్ ఫ్రైకు సురక్షితం. నెలకు ఒకసారి నూనె రకాన్ని మార్చడం వల్ల ఒమెగా-3, ఒమెగా-6 ఫ్యాటీ యాసిడ్స్ సమతుల్యత కాపాడబడుతుంది. ఈ చిన్న మార్పులతో గుండె, కాలేయం, మెదడు ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. మీ వంటశైలి మార్చుకుంటే.. ఆరోగ్యం మీ చేతుల్లోనే ఉంటుంది!

# ఆమ్లెట్, ఉడికించిన గుడ్డు బరువు తగ్గడానికి ఏది మంచిది?





**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రోటీన్‌కు గుడ్లు ఉత్తమం. అందుకే డైలీ గుడ్లు తినమని వైద్యులు సూచిస్తారు. అయితే బరువు తగ్గాలనుకునేవారికి ఉడికించిన గుడ్లు, ఆమ్లెట్‌లలో ఏది మంచిదనే సందేహం ఉంటుంది. ప్రోటీన్ పుష్కలంగా ఉండే ఆహారాల్లో గుడ్డుకు సాటిలేదు. అందుకే చాలా మంది తమ అల్పాహారంలో గుడ్లను ఖచ్చితంగా చేర్చుకుంటారు. అయితే గుడ్లను వండుకునే విధానాన్ని బట్టి వాటిలోని పోషకాలు, కేలరీల శాతం మారుతుంటాయి. ముఖ్యంగా బరువు తగ్గాలనుకునే వారికి ఉడికించిన గుడ్డు మంచిదా లేక ఆమ్లెట్ మంచిదా అనే సందేహం చాలా మందిలో ఉంటుంది. ఆరోగ్యపరంగా చూస్తే ఉడికించిన గుడ్డు అత్యుత్తమ ఎంపిక. దీనిని నూనె లేదా వెన్న లేకుండా కేవలం నీటిలో ఉడికిస్తారు. కాబట్టి అదనపు కొవ్వు చేరే అవకాశం లేదు. ఒక ఉడికించిన గుడ్డులో సుమారు 70 కేలరీలు మాత్రమే ఉంటాయి. ఇందులో ప్రోటీన్లు, విటమిన్లు, ఖనిజాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీరానికి కావాల్సిన శక్తిని ఇస్తూనే బరువును నియంత్రణలో ఉంచుతాయి. ప్రయాణాల్లో కూడా వీటిని సులభంగా తీసుకువెళ్లవచ్చు. ఆమ్లెట్ తినడానికి చాలా రుచిగా ఉంటుంది.. కానీ దీని తయారీ విధానమే పెద్ద మైనస్. ఆమ్లెట్ వేయడానికి నూనె, నెయ్యి లేదా వెన్న వాడటం వల్ల కేలరీల శాతం పెరుగుతుంది. ఉపయోగించే నూనెను బట్టి ఒక ఆమ్లెట్‌లో 90 నుండి 200 కేలరీల వరకు ఉండే అవకాశం ఉంది. అయితే ఆమ్లెట్‌లో టమోటాలు, ఉల్లిపాయలు, పాలకూర, క్యాప్సికమ్ వంటి కూరగాయలు చేర్చడం వల్ల ఫైబర్, విటమిన్లు అందుతాయి. తక్కువ నూనెతో వేసుకుంటే ఇది కూడా మంచి పోషకాహారమే. బరువును వేగంగా తగ్గించుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్న వారు ఉడికించిన గుడ్లు తినడమే ఉత్తమమని నిపుణులు సూచిస్తున్నారు. ఎందుకంటే వీటిలో కొవ్వు శాతం చాలా తక్కువ. ఒకవేళ మీరు ఆమ్లెట్ తినాలనుకుంటే.. నాన్-స్టిక్ పాన్ ఉపయోగించి అతి తక్కువ నూనెతో, ఎక్కువ కూరగాయలు చేర్చి వండుకోవడం మంచిది. దీనివల్ల కడుపు ఎక్కువసేపు నిండుగా ఉన్న అనుభూతి కలుగుతుంది.

# అతిగా తింటే మెదడుకు హాని జరుగుతుందా?



**హైదరాబాద్ పెన్ పవర్:** మనం ఫుడ్ తినేటప్పుడు మన శరీరం నుంచి కొన్ని సిగ్నల్స్ విడుదలై అవన్నీ కలిపి కడుపు నిండిందని మెదడుకు ఒక సిగ్నల్ ఇస్తాయి. ఇందులో మన పేగులు జీవక్రియలు చేసే శక్తిని ఉత్పత్తి చేసే అణువులు హార్మోన్లు అన్నీ ఉంటాయి. ఈ హార్మోన్లనే పాంక్రియాస్ గ్రంథికి ఇన్సులిన్ విడుదల చేయాలని సిగ్నల్స్ ఇస్తాయి. సాధారణంగా మనం తినాలనే కోరిక కలిగితే.. అది ఇష్టమైన ఫుడ్ అయితే.. బాగా లాగించేస్తాం.. ఇంకా ఏదైనా పండుగ వచ్చిందంటే చాలా స్పెషల్‌గా ఫుడ్ రెడీ చేసుకుని ఎంతో ఇష్టంగా తింటాం. ఇలాంటి ఫెస్టివల్ డేస్‌లో చాలామంది ఇష్టమైన డైట్ ప్లాన్‌లన్నీ పక్కనపెట్టి మంచిగా ఫుడ్ లాగిస్తుంటారు. అయితే మనం తీసుకున్న ఆహారం మనం మెదడులో ఎన్నో ముఖ్యమైన పనులు చేసేందుకు ఉపయోగపడుతుంది. ఇందులో మన మెమరీ పవర్ ఏకాగ్రత వంటి అంశాలు కూడా ఉన్నాయి. సరైన విధంగా పద్ధతిగా తీసుకునే ఆహారం మన మానసిక ఆరోగ్యానికి కూడా సహాయంగా ఉంటుందని నిపుణులు అంటున్నారు. మనం ఫుడ్ తినేటప్పుడు మన శరీరం నుంచి కొన్ని సిగ్నల్స్ విడుదలై అవన్నీ కలిపి కడుపు నిండిందని మెదడుకు ఒక సిగ్నల్ ఇస్తాయి. ఇందులో మన పేగులు జీవక్రియలు చేసే శక్తిని ఉత్పత్తి చేసే అణువులు హార్మోన్లు అన్నీ ఉంటాయి. ఈ హార్మోన్లనే పాంక్రియాస్ గ్రంథికి ఇన్సులిన్ విడుదల చేయాలని సిగ్నల్స్ ఇస్తాయి. ఇది మన శరీరంలో చక్కర స్థాయిలను నియంత్రిస్తుంది. ఈ సిగ్నల్స్ అన్నీ మన పేగులలోని అన్ని భాగాల నుండి వస్తుంటాయి. పాంక్రియాస్ గ్రంథి ద్వారా విడుదల ఈ హార్మోన్ల నమూనా, వీటి నుంచి మెదడుకు వెళ్లే సంకేతాలు కడుపు నిండిన తర్వాత మనకు కలిగించే నిద్ర మత్తు సంబంధించినవి. కానీ ఖచ్చితంగా ఈ ప్రక్రియ ఎలా పనిచేస్తుంది అనే దానిపై ఇంకా చాలా రీసెర్చ్ చేయాలని వాషింగ్టన్ డిసి లోని నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ పరిశోధకులు తెలిపారు. అయితే ఎక్కువగా తిన్న తర్వాత రక్తప్రసరణ తగ్గదు అని పరిశోధనలు చెబుతున్నాయి. ఒకేసారి ఎక్కువగా తిన్న కూడా మన మెటబాలిజంపై కాస్త తక్కువ ప్రభావమే పడుతుందని పరిశోధకులు అంటున్నారు. పరిశోధకులు చేసిన అధ్యయనం ప్రకారం.. అప్పుడప్పుడు ఎక్కువగా తినడం అందరూ అనుకున్నంత ప్రమాదకరం కాదు అని తెలిపారు. అయితే ఈ అధ్యయనాన్ని కేవలం యువతపైనే, ఆరోగ్యకరమైన వ్యక్తులపైనే చేశామని దీనిపై మరింత పరిశోధన చేయాల్సి ఉందని వారు అంటున్నారు. ఎక్కువగా తినడం వల్ల చెడు ప్రభావం పడుతుందన్న గ్యారెంటీ లేదని పరిశోధకులు తెలిపారు. ఒక్కసారి అత్యధికంగా ఆహారాన్ని తీసుకోవడం వల్ల మన శరీరంపై జరిగే ప్రభావాలపై తక్కువ పరిశోధనలు ఉన్నప్పటికీ ప్రస్తుతం పరిశోధనలు మాత్రం మన మెదడుకి అంత ప్రమాదకరం కాదని సూచిస్తున్నాయి. కొన్ని అధ్యయనాల ప్రకారం ఒకసారి ఎక్కువగా తినడం మనం అనుకున్నంత ప్రమాదం కాదని నిపుణులు అంటున్నారు. అప్పుడప్పుడు ఎక్కువగా తినడం ఓకే కానీ అంతకుమించి తింటే శరీరంపై ఒత్తిడి పెరుగుతుందని.. వరుసగా ఐదు రోజులపాటు ఎక్కువగా తినడం వల్ల మన మెదడుపై దీర్ఘకాలిక ప్రభావాలు పడతాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

## ఎడాపెడా యాంటీబయాటిక్స్ వాడేస్తున్నారా.!



**హైదరాబాద్ పెన్ పవర్:** జబ్బు వచ్చింది కదా అని.. ఏది పడితే ఆ యాంటీ బయోటిక్స్ వాడేస్తున్నారా.? సాధారణ ఇన్ఫెక్షన్లకు కూడా యాంటీ బయోటిక్స్ వాడితే లేనిపోని రోగాలు వస్తాయని డాక్టర్లు చెబుతున్నారు. మరి అదేంటో ఇప్పుడు ఈ స్టోరీలో తెలుసుకుందామా. ఓ సారి లుక్కేయండి ఇక్కడ. యాంటీబయాటిక్స్‌ను అవసరం లేకుండా, డాక్టర్ సూచనలేకుండా వాడుతున్నారా? ఇది అత్యంత ప్రమాదకరమని ప్రధాని మోదీ మన్ కీ బాత్‌లో హెచ్చరించారు. యాంటీబయాటిక్స్ ప్రభావం తగ్గిపోవడం వల్ల భవిష్యత్తులో సాధారణ ఇన్ఫెక్షన్లకే చికిత్స చేయలేని పరిస్థితి ఏర్పడుతుందని అన్నారు. ఎయిమ్స్ మాజీ డైరెక్టర్ డాక్టర్ రణదీప్ గులేరియా కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ రోజు ఆసుపత్రుల్లో, ముఖ్యంగా ఐసీయూలో చేరుతున్న అనేక మంది రోగులు మల్టీ డ్రగ్ రెసిస్టెంట్ ఇన్ఫెక్షన్లతో బాధపడుతున్నారనీ అన్నారు. అంటే ఏ యాంటీబయాటిక్ కూడా పనిచేయని స్థితి. దీనికి ప్రధాన కారణం యాంటీబయాటిక్స్‌ను ఎడాపెడా వాడటమే అని తెలిపారు. జ్వరం, దగ్గు, విరేచనాలు, కడుపునొప్పి, మూత్రం పోస్తే మంట వంటి సమస్యలు వచ్చిన వెంటనే స్వయంగా యాంటీబయాటిక్స్ తీసుకోవద్దని, తప్పనిసరిగా డాక్టర్‌ను సంప్రదించాలని సూచించారు. ఏ ఆరోగ్య సమస్య వచ్చినా స్వయం మందులు వద్దు. డాక్టర్ సలహా తీసుకున్న తర్వాతే యాంటీబయాటిక్స్ వాడాలి" అన్నారు. నీతి అయోగ్? సభ్యుడు డాక్టర్ వీకే పాల్ కూడా ఇదే అన్నారు. యాంటీబయాటిక్స్‌ను అతిగా వాడటం వల్లే యాంటీమైక్రోబియల్ రెసిస్టెన్స్ పెరుగుతోందని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా యాంటీబయాటిక్స్ ప్రతి ఏడాది లక్షలాది ప్రాణాలను కాపాడుతున్నాయి. కానీ అవసరం లేని సందర్భాల్లో వాడితే ప్రమాదకరంగా మారతాయనీ చెప్పారు. యాంటీబయాటిక్స్ ప్రాణాంతక ఇన్ఫెక్షన్లపై పని చేయడం లేదని ఆందోళన వ్యక్తం చేసారు. డాక్టర్లు కూడా బాధ్యతగా ప్రామాణిక మార్గదర్శకాల ప్రకారం మాత్రమే యాంటీబయాటిక్స్ సూచించాలని అన్నారు. మొత్తానికి యాంటీబయాటిక్స్‌ను సరైన సమయంలో, సరైన మోతాదులో, డాక్టర్ సూచనలతో మాత్రమే వాడితేనే అవి ప్రాణాలను కాపాడతాయని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. లేని పక్షంలో రాబోయే రోజుల్లో సాధారణ ఇన్ఫెక్షన్లకే చికిత్స దొరకని ప్రమాదం ఉందని స్పష్టం చేసారు.

## ఒక కప్పు కాఫీ పిల్లలకు ఎంత ప్రమాదకరమో..!



**హైదరాబాద్ పెన్ పవర్:** ఉదయం, సాయంత్రం సమయాల్లో టీ, కాఫీలు తాగడం సాధారణమే. కొంత అనారోగ్యకరమైన వీటిని సేవించడం వల్ల పెద్దలపై తక్కువ చెడు ప్రభావమే ఉంటుంది. కానీ, పిల్లల్లో టీ, కాఫీలు సేవించడం వల్ల చాలా దుష్ప్రభావాలు చూపుతాయి. పిల్లల ఎదుగుదలపై తీవ్ర ప్రభావం ఉంటుంది. పిల్లల మెదడు అభివృద్ధికి టీ, కాఫీలు చాలా హాని చేస్తాయని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఉదయం లేచిన తర్వాత, సాయంత్రంపూట చాలా మంది టీ లేదా కాఫీ సేవిస్తుంటారు. ఇది కొంత వరకు అనారోగ్య కారణమని తెలిసినా వాటిని సేవించకుండా ఉండలేరు. అయితే, పిల్లలకు మాత్రం టీ, కాఫీలు చాలా హాని కారకమని వైద్య నిపుణులు చెబుతున్నారు. కాఫీ తాగితే పిల్లలకు తీవ్ర అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. ఐరన్ లోపానికి దారి: పిల్లలు అంటే ఎదిగేదశలో ఉన్నవారు. మనం వారి కోసం ప్రతిరోజూ పోషకాలు కలిగిన కూరగాయలు, ఆకుకూరలు, గుడ్లు లాంటి పదార్థాలను అందించాలి. కానీ, తిన్న తర్వాత ఒక కప్పు టీ గానీ, కాఫీ గానీ తాగితే.. ఆ ఆహారంలోని పోషకాలు ఏవీ శరీరానికి అందవు. వీటిలో ఉండే కొన్ని రసాయనాలు తినే ఆహారంలోని ఐరన్ రక్తంలోకి శోషించకుండా నిరోధిస్తాయి. ఫలితంగా పిల్లలు ఎంత తిన్నా.. వారు సన్నగానే ఉంటారు. రక్తహీనత ఏర్పడుతుంది. ఎప్పుడూ అలసిపోయినట్లుగా కనిపిస్తుంటారు. వివిధ పనుల్లో బిజీగా ఉండే పెద్దలు ఉపశమనం కోసం కాఫీ లేదా టీ తాగుతుంటారు. కానీ, పిల్లలకు కాఫీ, టీలలో ఉండే కెఫిన్.. నాడీ వ్యవస్థను అతిగా ప్రేరేపిస్తుంది. దీంతో వారిలో కొంత ఆందోళన ఏర్పడుతుంది. చదువు దృష్టి పెట్టలేరు, ఒక చోట కుదురుగా కూర్చోలేరు. అంతేగాక, ఈ కెఫిన్ వారి నిద్రను పూర్తిగా చెడగొడుతుంది. రాత్రిపూట టీ తాగే పిల్లలకు గాఢ నిద్ర రాదు. దీంతో వారి ప్రవర్తనలో మార్పులు వస్తాయి. మరుసటి రోజు ఉదయం లేవగానే చిరాకుగా ఉంటారు. చాలా మంది తల్లులు తమ పిల్లలు ఉదయం ఎలాంటి ఆహారం తీసుకోవడం లేదని ఫిర్యాదు చేస్తుంటారు. దీనికి ప్రధాన కారణం ఉదయం నిద్రలేవగానే ఖాళీ కడుపుతో తాగే టీ లేదా కాఫీనే. ఇది ఆకలిని ప్రేరేపించే హార్మోన్లను అణిచివేస్తుంది. అంతేగాక, ప్రేగులలో యాసిడిటీని పెంచుతుంది. గుండెలో మంట, మలబద్ధకం, కడుపు సమస్యలను కలిగిస్తుంది. ఆకలి లేకపోతే పిల్లలు తినరు. తినకపోతే వారిలో ఎదుగుదల ఉండదు. తాగే కాఫీలో చక్కెర కూడా ఉంటుంది. అది అధిక స్థాయిలో ఉండటం కూడా పిల్లలకు హాని చేస్తుంది. పిల్లల దంతాలు పుచ్చిపోయే ప్రమాదం ఉంది. కేలరీలను పెంచి ఊబకాయులను కూడా చేసే అవకాశం ఉంది. పదేళ్ల కంటే తక్కువ వయస్సున్న పిల్లలకు పాలు, పోషక విలువలు కలిగిన గంజి లేదా పండ్ల రసాలు ఇవ్వడం చాలా మంచిది. పిల్లలు మారాం చేస్తున్నారు కదా అని టీ, కాఫీ లాంటివి తాగిస్తే వారిని ప్రమాదంలో పడేసినట్లే అవుతుంది. పిల్లల మెదడు అభివృద్ధి, శారీరక ఆరోగ్యం దెబ్బతీసినవారు అవుతారు. అధికంగా చక్కెర తీసుకుంటే పిల్లలు హైపర్ యాక్టివ్ అయ్యే అవకాశాలు కూడా ఉన్నాయని చెబుతున్నారు.

# చలికాలంలో ఇడ్లీ పిండి పులియట్లేదా?



**హైదరాబాద్ పెన్ పవర్:** చాలా మందికి ఉదయం పూట బ్రేక్ ఫాస్ట్ కింద ఇడ్లీ తినడం అలవాటు. కానీ ఇడ్లీ పిండి సరిగ్గా పులియబెడితేనే ఇడ్లీ మృదువుగా మారుతుంది. శీతాకాలం కాబట్టి ఇడ్లీ పిండి త్వరగా పులియదు. శీతాకాలంలో ఇడ్లీ పిండి పులియబెట్టడానికి ఏమి చేయాలో ఇక్కడ కొన్ని ప్రత్యేక చిట్కాలను నిపుణులు సూచిస్తున్నారు. ఇండ్లీ పిండి తయారు చేసిన తర్వాత పిండిని గ్యాస్ దగ్గర, ఫ్రిజ్ పైన లేదా వంటగదిలో ఏదైనా వెచ్చని ప్రదేశంలో ఉంచండి. మీకు ఓవెన్ ఉంటే, లైట్ ఆన్ చేసి లోపల ఉంచండి. కానీ ఓవెన్ వేడి చేయకూడదు. గోరువెచ్చని నీటిని వాడవచ్చు. పిండిని నానబెట్టేటప్పుడు లేదా రుబ్బేటప్పుడు కొద్దిగా గోరువెచ్చని నీటిని వాడటం వల్ల కిణ్వ ప్రక్రియకు సహాయపడుతుంది. వెంటనే ఉప్పు వేయకూడదు. రుబ్బిన తర్వాత పిండిని కొద్దిసేపు పులియనివ్వాలి. ఆ తరువాత ఉప్పు వేయాలి. త్వరగా ఉప్పు వేయడం వల్ల కిణ్వ ప్రక్రియ నెమ్మదిస్తుంది. కొంచెం పోహా లేదా వండిన అన్నం కూడా వేయవచ్చు. గ్రైండ్ చేస్తున్నప్పుడు 2-3 టేబుల్ స్పూన్ల మందపాటి పోహా లేదా కొద్దిగా వండిన బియ్యం అన్నం వేస్తే కిణ్వ ప్రక్రియ బాగా జరుగుతుంది. పిండిని
మరీ మెత్తగా చేయకుండా పిండిని కొద్దిగా మందంగా ఉంచండి. పలుచగా ఉండే పిండి త్వరగా పులియదు. మీ దగ్గర పాత పులియబెట్టిన పిండి ఉంటే మీరు దానిని కూడా ఉపయోగించవచ్చు. 1-2 టేబుల్ స్పూన్ల పాత పులియబెట్టిన ఇడ్లీ పిండిని కొత్త పిండితో కలపండి. అయితే పాన్ మూత ప్రతిసారీ తెరిచి చూసుకుంటూ ఉండకూడదు. శీతాకాలంలో పిండిని పులియబెట్టడానికి 12-18 గంటలు పట్టవచ్చు. అందుకే తొందరపడకండి. ఇంకా పులియకపోతే 1 టీస్పూన్ చక్కెర కలిపి 2-3 గంటలు వెచ్చని ప్రదేశంలో ఉంచండి. లేదా 1-2 టీస్పూన్ల పాత పులియబెట్టిన పిండిని జోడించండి. ఇలా చేయడం వల్ల ఇడ్లీ పిండి త్వరగా పులుస్తాయి. ఇడ్లీలు కూడా మృదువుగా ఉంటాయి.

# 2026 T20 ప్రపంచ కప్‌కు ఇంగ్లాండ్ జట్టు ప్రకటన.. డేంజరస్ బౌలర్ రీ ఎంట్రీ




**హైదరాబాద్ పెన్ పవర్:** లండన్: 2026 టీ20 వరల్డ్ కప్ కోసం ఇంగ్లాండ్ క్రికెట్ బోర్డు (ఈసీబీ) తమ జట్టును ప్రకటించింది. 15 మంది పేర్లతో కూడిన జట్టును మంగళవారం (డిసెంబర్ 30) ఈసీబీ అనౌన్స్ చేసింది. యంగ్ బ్యాటర్ హ్యారీ బ్రూక్ కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. యాషెస్ సిరీస్‌లో గాయపడ్డ డేంజరస్ పేసర్ జోఫ్రా ఆర్చర్ వరల్డ్ కప్ జట్టులో స్థానం దక్కించుకున్నాడు.

మెగా టోర్నీ ప్రారంభ సమయానికి ఒకవేళ ఆర్చర్ కోలుకోకపోతే అతడి స్థానంలో బ్రైడాన్ కార్స్ బరిలోకి దిగనున్నాడు. ఇక, తన కెరీర్‌లో ఇంగ్లాండ్ తరపున ఒక్క వైట్-బాల్ మ్యాచ్ కూడా ఆడని పేసర్ జోష్ టంగ్ అనూహ్యంగా టీ20 వరల్డ్ కప్ స్క్వాడ్‌లో చోటు దక్కించుకున్నాడు. యాషెస్ సిరీస్‌లో ప్రదర్శన ఆధారంగా టంగ్ టీ20 జట్టుకు ఎంపికయ్యాడు.

2026 టీ20 వరల్డ్ కప్‌కు భారత్, శ్రీలంకలు సంయుక్తంగా అతిథ్యమిస్తున్నాయి. 2026, ఫిబ్రవరి 7 నుంచి మార్చి 8 వరకు ఈ టోర్నమెంట్ జరగనుంది. ఈ మెగా టోర్నీకి ఫిబ్రవరి 7న పాకిస్తాన్ - నెదర్లాండ్ మ్యాచ్‌తో తెరలేవనుంది. క్రికెట్ ప్రపంచంలో అత్యంత రసవత్తరంగా, ఫ్యాన్స్ థ్రిల్లింగ్?గా ఫీలయ్యే ఇండియా-పాక్ జట్ల మధ్య మ్యాచ్ ఫిబ్రవరి 15న కొలంబోలో జరగనుంది. ఇండియా, పాకిస్తాన్ , అమెరికా(USA), నమీబియా, నెదర్లాండ్స్ ఒకే గ్రూపులో ఉన్నాయి. ఈసారి ఈ మెగా టోర్నీలో 20 జట్లు తలపడనున్నాయి. భారత్, శ్రీలంక, బంగ్లాదేశ్, అఫ్గానిస్థాన్, యూఏఈ, ఒమన్, వెస్టిండీస్, అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా, నమీబియా, జింబాబ్వే, ఐర్లాండ్, ఇంగ్లాండ్, నెదర్లాండ్స్, ఇటలీ, నేపాల్, పాకిస్థాన్ జట్లు టోర్నమెంట్ లో భాగం కానున్నాయి

ఇంగ్లాండ్ టీ20 ప్రపంచ కప్ జట్టుహ్యారీ బ్రూక్ (సి), రెహాన్ అహ్మద్, జోఫ్రా ఆర్చర్, టామ్ బాంటన్, జాకబ్ బెథెల్, జోస్ బట్లర్, బ్రైడాన్ కార్స్, సామ్ కుర్రాన్, లియామ్ డాసన్, బెన్ డకెట్, విల్ జాక్స్, జామీ ఓవర్టన్, ఆదిల్ రషీద్, ఫిల్ సాల్ట్, జోష్ టంగ్, ల్యూక్ వుడ్

# హైదరాబాద్‌కు ఏమైంది..? విజయ్ హజారే ట్రోఫీలో వరుసగా మూడో ఓటమి



**హైదరాబాద్ పెన్ పవర్:** బ్యాటర్లు రాణించి భారీ స్కోరు చేసినా విజయ్ హజారే వన్డే ట్రోఫీలో హైదరాబాద్ వరుసగా మూడో ఓటమిని ఎదుర్కొంది. సోమవారం జరిగిన గ్రూప్-బి పోరులో అస్సాం 4 వికెట్ల తేడాతో హైదరాబాద్‌పై గెలిచింది. తొలుత రాహుల్ సింగ్ (79), అభిరత్ రెడ్డి (54), నితేష్ రెడ్డి (53) హాఫ్‌సెంచరీలతో రాణించడంతో హైదరాబాద్ నిర్ణీత 50 ఓవర్లలో 310/8 స్కోరు చేసింది. అస్సాం బౌలర్లలో అబ్దుల్ అజీజ్ మూడు వికెట్లు పడగొట్టాడు. అనంతరం ఛేజింగ్‌లో అస్సాం 49.3 ఓవర్లలో 314/6 స్కోరు చేసి గెలిచింది. ఆ టీమ్ ప్లేయర్ శివ్ శంకర్ రాయ్ (112) సెంచరీతో సత్తా చాటాడు. కెప్టెన్ సీవీ మిలింద్ మూడు వికెట్లు తీసినా మిగతా బౌలర్లు ఫెయిలయ్యారు. బుధవారం జరిగే తర్వాతి మ్యాచ్‌లో బరోడాతో హైదరాబాద్ పోటీపడనుంది.

# మలింగకు కీలక బాధ్యతలు అప్పగించిన శ్రీలంక క్రికెట్ బోర్డు

- శ్రీలంక ఫాస్ట్ బౌలింగ్ కన్సల్టెంట్‌గా మాజీ పేసర్ మలింగ నియామకం
- టీ20 ప్రపంచకప్ కోసం లంక పేసర్లకు ప్రత్యేక శిక్షణ
- నెల రోజుల పాటు సేవలు అందించనున్న మలింగ
- భారత్, శ్రీలంక వేదికగా త్వరలో జరగనున్న మెగా టోర్నీ
- మలింగ అపార అనుభవం జట్టుకు కలిసొస్తుందన్న శ్రీలంక బోర్డు



**హైదరాబాద్ పెన్ పవర్:** 2026 టీ20 ప్రపంచకప్‌నకు సన్నాహాల్లో భాగంగా శ్రీలంక క్రికెట్ బోర్డు కీలక నిర్ణయం తీసుకుంది. పేస్ దిగ్గజం, యార్కర్ స్పెషలిస్ట్ లసిత్ మలింగను జాతీయ జట్టుకు 'ఫాస్ట్ బౌలింగ్ సలహాదారు'గా నియమించింది. ఈ మెగా టోర్నీకి భారత్‌తో పాటు శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యం ఇస్తున్న నేపథ్యంలో, తమ బౌలింగ్ దళాన్ని పటిష్టం చేసేందుకు బోర్డు ఈ నిర్ణయం తీసుకుంది. మలింగ నియామకం స్వల్పకాలిక ప్రాతిపదికన జరిగింది. దాదాపు నెల రోజుల పాటు మలింగ ఈ బాధ్యతల్లో కొనసాగుతాడని ఎస్ఎల్‌సీ మంగళవారం ఒక అధికారిక ప్రకటనలో తెలిపింది. ఈ సమయంలో మలింగ తన అపార అనుభవంతో జాతీయ ఫాస్ట్ బౌలర్లకు మెరుగులు దిద్దనున్నాడు. ముఖ్యంగా టీ20 ఫార్మాట్‌లో అత్యంత కీలకమైన 'డెత్ బౌలింగ్' (చివరి ఓవర్లు) వేయడంలో పేసర్లకు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో మలింగకు ఘనమైన రికార్డు ఉంది. 30 టెస్టులు, 226 వన్డేలు, 84 టీ20 మ్యాచ్‌లు ఆడిన ఈ వెర్సటైల్ పేసర్.. ఆయా ఫార్మాట్లలో వరుసగా 101, 338, 107 వికెట్లు పడగొట్టాడు. 2014లో శ్రీలంక టీ20 ప్రపంచకప్ గెలవడంలో మలింగ కీలక పాత్ర పోషించాడు. ఐపీఎల్‌లో ముంబై ఇండియన్స్ సహా ప్రపంచవ్యాప్తంగా అనేక లీగ్‌లలో ఆడిన అనుభవం అతడి సొంతం. 2026 ఐసీసీ పురుషుల టీ20 ప్రపంచకప్ ఫిబ్రవరి 7న ప్రారంభం కానుంది. కొలంబోలోని ఎస్ఎస్‌సీ మైదానంలో తొలి మ్యాచ్ జరగనుంది. స్వదేశంలో జరుగుతున్న ఈ మెగా టోర్నీ కోసం శ్రీలంక జట్టును సన్నద్ధం చేయడంలో మలింగ అనుభవం ఎంతగానో ఉపయోగపడుతుందని బోర్డు ఆశిస్తోంది.

ప్రిషా రాజేష్ సింగ్ ఎరుపు రంగు చీరలో బీచ్ సైడ్ గ్లామర్ తో అదరగొట్టింది

# కింగ్100లో కూలీ లుక్ లో నాగ్

అక్కినేని నాగేశ్వరరావు కొడుకుగా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన నాగార్జున ఆ తర్వాత తనదైన స్టైల్ లో ఆ వారసత్వాన్ని కొనసాగిస్తూ వస్తున్నారు. రొమాంటిక్ హీరోగా, ఫ్యామిలీ ఎంటర్టైనర్ గా, యాక్షన్, మాస్, భక్తిరస చిత్రాలు మాత్రమే కాకుండా అన్ని రకాల జానర్లలోనూ నాగ్ తనదైన ముద్ర వేసి స్టార్ హీరోగా ఎదిగారు. అలాంటి నాగ్ ఇప్పుడు తన కెరీర్లో మైల్ స్టోన్ ఫిల్మ్ అయిన 100వ సినిమాతో బిజీగా ఉన్న సంగతి తెలిసిందే.

**100వ సినిమా కోసం నాగ్ స్పెషల్ కేర్**

వాస్తవానికి నా సామిరంగ సినిమా తర్వాత నాగ్ వెంటనే తన 100వ సినిమాను చేయాల్సింది కానీ 100వ ప్రాజెక్టు కాబట్టి కాస్త జాగ్రత్త తీసుకునే నేపథ్యంలో కాస్త ఆలస్యమైంది. అందుకని నాగ్ ఈ గ్యాప్ లో ఖాళీగా లేరు. ఈ గ్యాప్ లో నాగ్ వేరే హీరోల సినిమాల్లో కీలక పాత్ర చేయడం, విలన్ గా కనిపించడం, బిగ్ బాస్ లాంటివి చేస్తూ ఆడియన్స్ కు అందుబాటులోనే ఉన్నారు.

**కుబేర, కూలీ తో ఆకట్టుకున్న నాగ్**

రీసెంట్ గా కుబేర, కూలీ సినిమాల్లో నటించి తన యాక్టింగ్ తో అందరినీ మెప్పించిన నాగ్, తన 100వ సినిమా విషయంలో చాలా ప్లాన్డ్ గా ఉన్నారు. ఈ మైల్ స్టోన్ ఫిల్మ్ కు కోలీవుడ్ డైరెక్టర్ రా కార్తీక్ దర్శకత్వం వహిస్తున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన షూటింగ్ శరవేగంగా జరుగుతుండగా, ఈ మూవీ షూటింగ్ పై ఓ అప్డేట్ తెలుస్తోంది.

**కేరళలో కింగ్100**

కింగ్100 వర్కింగ్ టైటిల్ తో తెరకెక్కుతున్న ఈ మూవీ నెక్స్ట్ షెడ్యూల్ కేరళలో ఉంటుందని సమాచారం. రీసెంట్ గా వచ్చిన కూలీ సినిమాలో నాగ్ ఎలాంటి హెయిర్ స్టైల్ తో అయితే కనిపించారో ఇప్పుడీ సినిమాలో కూడా అదే హెయిర్ స్టైల్ తో కనిపించనున్నారని తెలుస్తోంది. కాగా ఈ మూవీకి లాటరీ కింగ్ అనే టైటిల్ ను పరిశీలిస్తున్నారట. మరి ఈ సినిమా ఏ జానర్ లో రానుంది? మిగిలిన విషయాలు త్వరలోనే వెల్లడి కానున్నాయి.



ఆంచల్ ముంజాల్ హాయిగా గళ్ల చొక్కా దుస్తులలో సంవత్సరాంతపు చలిని ఆస్వాదిస్తోంది



Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. and published at 38/291-6, Sreerama nagar colony, Near Central prison, KADAPA CITY, KADAPA DISTRICT, ANDHRAPRADESH-516002, Editor : GANTYADA APPARAO Mobile : 9059465965, RNI : APTEL/25/A2231, editorpenpower@gmail.com